సాక్షి 24|7

విజయనగరం

గురువారం 31-8-2017

చెల్లింపులకు కళ్లెం



జిల్లా ఖజానా కార్యాలయం

ఆర్థిక ఆంక్షలు లేనిపోని సమస్యలు తెస్తోంది. ఖజానాలో చెల్లింపులు నిలిచిపోవడంతో వాటిపైనే ఆధారపడిన వివిధ రంగాలవారిని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. సర్కారు కూడా తమకు అనుకూలం అనుకున్న కొన్నింటికే అనుమతులు ఇస్తోంది. గడచిన వారం రోజులుగా అన్ని రకాల బిల్లులూ పెండింగ్‌లో పడ్డాయి. దీనివల్ల అత్యవసరంగా ఎదురు చూస్తున్నవారికి నిరాశే ఎదురవుతోంది. అంతేనా... ఈ నెల జీతాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- ✔ కలవరపెడుతున్న ఆర్థిక సంక్షోభం
- ✔ బిల్లులు సిద్ధమవుతున్నా నిలిచిపోతున్న చెల్లింపులు
- ✔ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొన్ని బిల్లులకే క్యాష్
- ✔ ఈ నెల జీతాలకూ అనుమానమే!
- ✔ రూ. 200 కోట్ల విలువయిన 300 బిల్లుల నిలిపివేత

విజయనగరం కంటోన్మెంట్:

రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ద్వారా చెల్లించాల్సిన బిల్లులు, అలవెన్సులు, ఇతర నిధులపై ఆంక్షలు విధించింది. ఆర్థిక సంక్షోభాన్ని కనిపించనీయకుండా కొన్ని బిల్లులను మాత్రమే ఆమోదిస్తూ మిగతా బిల్లులను నిలిపివేస్తున్నారు. ఖజానా శాఖ సెంట్రల్ సర్వర్ ఆపరేషన్ ద్వారా రాష్ట్ర రాజధాని నుంచి కొన్ని బిల్లులు మాత్రమే బ్యాంకులకు పంపిస్తున్నారు. ఈ నెల 24 నుంచి పూర్తిగా నిలుపుదల చేశారు. ఈ క్రమంగా జిల్లాలో రూ.200 కోట్లకు పైగా బిల్లులు నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా వేతనాలు ఇతరత్రా కాకుండా రోజుకు రూ. 40 నుంచి రూ. 50 లక్షల వరకూ లావాదేవీలు అవుతుండేవి. మూడు నెలలుగా ఈ బిల్లులు దాదాపుగా నిలిచిపోయాయి. ఉద్యోగులకు చెందిన ఎర్న్‌డ్ లీవు, సరెండర్ బిల్లులు కూడా గడచిన 3 నెలలుగా విడుదల కావడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. రాబడి ఖర్చుల నిష్పత్తిని బేరీజు వేసుకుని జిల్లా స్థాయిలో అనుమతులు ఇవ్వకుండా స్టేట్ సెంట్రల్ సర్వర్‌నుంచి లావాదేవీలను

- మిగతా 2వపేజీలో ▶

అబ్కారీలో అంతర్యుద్ధం



ఎక్సైజ్ శాఖ డీసీ కార్యాలయం

- ➢ జిల్లా ఎక్సైజ్‌లో రాజ్యమేలుతున్న ముదుర్లు
- ➢ తమకు నచ్చని డీసీని విధుల్లో చేరనివ్వని పరిస్థితులు
- ➢ ఆమె నిర్ణయాలు తమ స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నందునే
- ➢ మామూళ్ల పంపకాల్లో తలెత్తిన వివాదాలు
- ➢ ప్రస్తుతం గాలిలో ఉన్న నాగలక్ష్మి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో వివాదాలు తారాస్థాయికి చేరాయి. ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ విధులు నిర్వర్తించేందుకు వీలుకాని పరస్థితులు చోటు చేసుకున్నాయి. అసలు ఇంతలా ఈ శాఖలో విభేదాలు తలెత్తడానికి కారణాలు... డీసీ స్థాయి అధికారితో ఉద్యోగులకు వచ్చిన ఇబ్బందులు.. ఆమె ఎందుకు సెలవుపై వెళ్లారు... ఇప్పటికే ఇన్‌చార్జ్‌గా ఉన్న విశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు ఎందుకు అప్పగించారనే దానిపై పరిశీలించినపుడు అనేక ఆసక్తికర విషయాలు, అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి.

'మామ్మూళ్లు'గా వారంతా ఒక్కటే

ఎక్సైజ్ శాఖ పేరు చెప్పగానే మామ్మూళ్ల మత్తు అనేది అందరిలోనూ ఉండే అభిప్రాయం.ప్రతి మద్యం దుకాణం నుంచి రూ. 20 నుంచి రూ. 25 వేల వర కు వసూలు చేస్తారని, ఆ మొత్తాలను అధికార పార్టీ నేతల నుంచి స్థానిక నాయకుల వరకూ, కింది స్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకూ పంచుకుంటారని, డీసీ, ఈఎస్ స్థాయి అధికారులకు ఒక్కో దుకాణం నుంచి ఏరియాలను బట్టి రూ. రెండు వేల నుంచి రూ.ఐదు వేల వరకు

- మిగతా 2వపేజీలో ▶

శృంగవరపుకోటలో కుండపోత



శృంగవరపుకోట పట్టణంలో బుధవారం సాయంత్రం కుండపోత వాన కురిసింది. పగలంతా ఎండతో అల్లాడించి... సాయంత్రమయ్యేసరికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వాన పడింది. ఈ సందర్భంగా విశాఖ రోడ్‌లో కుళ్లు చెరువుకు గండిపడటంతో పట్టణం మొత్తం జలమయమైంది. పట్టణ ప్రజలను భయకంపితులను చేసింది.

- 6లో...

కస్తూర్బాలో ఇంటర్‌విద్య



ఇంటర్ కోర్సులు మంజూరయిన విజయనగరం కేజీబీవీ ప్రాంగణం

- ✦ జిల్లాలో రెండు కేంద్రాలకు అనుమతి
- ✦ ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు
- ✦ కేంద్రాల ఎంపికలోనూ రాజకీయం
- ✦ 320 మంది విద్యార్థినులకే అవకాశం
- ✦ పార్వతీపురం డివిజన్‌కు మొండిచేయి

విజయనగరం అర్బన్:

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)లో ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం ఎట్టకేలకు సిద్ధమయింది. సర్వశిక్షా అభియాన్ యంత్రాంగం రెండేళ్లుగా పెడుతున్న ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతించింది. అయితే జిల్లాకు కేవలం రెండు చోట్ల మాత్రమే ఇంటర్మీడియట్ కోర్సులను మంజూరు చేసింది. విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాల పరిధిలోని కేజీబీవీల్లో స్థానిక శాసన సభ్యులు ఎంపిక చేసిన రెండింటిలో ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ మేరకు సర్వశిక్ష అభియాన్ పీఓలతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. విజయనగరం

మిగతా 2వపేజీలో ▶

చెల్లింపులకు కళ్లెం

మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తుండటంతో ఏ బిల్లులు ఏ సమయంలో ఆమోదిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పలువురు బిల్లుల ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు. నెలల తరబడి బిల్లులు అవకపోవడంతో ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, కంటింజెంట్ బిల్లుల కోసం ఎదురు చూస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగుల జీతాలకూ అనుమానమే?

ప్రతీ నెలా వేతనాల బిల్లులు అయ్యే నాటికి బ్యాం కులకు జాబితాలు పంపి ఆమోదం జరిగేది. కానీ ఈ నెల 24నుంచి బిల్లులను ఆమోదించకపోవడంతో వేతనాల బిల్లులు ప్రశ్నార్థకంగా మారాయని పలువురు ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎప్పటికి ఆమోదిస్తారో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 17వేల మంది పెన్షనర్లు. 23వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వీరికి ఈ నెల ఒకటిన వేతనాలు అందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బ్యాంకుల వద్ద నిలిపేస్తున్న బిల్లులు

జిల్లా ఖజానా శాఖలో బిల్లులను ఆమోదించేందుకు ఆటంకాలు ఏర్పడటం లేదు. అయితే బిల్లులు మామూలుగానే ఆమోదిస్తూ బ్యాంకులకు పంపించాల్సిన (ఆమోదం కోసం) జాబితాలను మాత్రం రాష్ట్ర ఖజానా శాఖ నుంచి మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. దీని ప్రకారమే బిల్లులు అవుతున్నాయి. ఈ నెల 24 నుంచి ఆ మెసేజ్‌లూ రావడం లేదు. పూర్తిగా బిల్లుల ఆమోదాన్ని నిలిపివేశారు.

రూ. 200 కోట్లు పెండింగ్

జిల్లా వ్యాప్తంగా వివిధ బిల్లులను చెల్లించాల్సి ఉండగా నేటికీ చెల్లించడం లేదు. ఇప్పటివరకూ 300 బిల్లులను నిలిపివేశారు. వీటి విలువ రూ. 200 కోట్లకు పైగానే ఉంటుందని తెలుస్తోంది. అలాగే వేతనాల బిల్లులు నిలుపుదల చేయకుండా కొనసాగిస్తున్నారు. ఈ నెల వాటిపైనా ప్రభావం పడవచ్చు. ప్రస్తుతం విద్యుత్, టెలీఫోన్, ఆండోరియం వంటి బిల్లులు మాత్రమే నడుస్తున్నా యి. జిల్లా వ్యాప్తంగా ఇవి కాకుండా చిన్న చిన్న బిల్లులు సైతం జరగడం లేదు. వివిధ అవసరాల కోసం ఉద్యోగులు ఇచ్చే సరెండర్ లీవుల బిల్లులు సైతం నిలిచిపోవడంతో వారంతా అవస్థలు పడుతున్నారు.

ఐడీ నంబర్లు ఇచ్చి మరీ ....

కొన్ని శాఖలకు సంబంధించిన బిల్లుల్లో రాష్ట్ర ప్రభుత్వమే కొన్ని బిల్లులు చేయాలని ఆదేశాలి స్తోంది. ఇందులోనూ కొన్ని హెడ్స్‌కు ఐడీ నంబర్లు ఇచ్చి ఆ బిల్లులనే ఆమోదించాలని చెబుతోంది. ఆయా శాఖల ద్వారా బిల్లుల ఐడీ నంబర్లు ఇచ్చి వాటిని బ్యాంకులకు పంపించాలని సూచిస్తోంది. దీనివల్ల మిగతావారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, వివిధ నిర్మాణ పనులకు సంబంధించిన కోట్లాది రూపాయల విలువయిన బిల్లులు కూడా ఆమోదించడం లేదు.

బిల్లులు సిద్ధం చేస్తున్నాం



జిల్లాలో బిల్లులను నిలిపివేయడం లేదు. కొనసాగుతున్నాయి. అయితే ప్రభుత్వ సూచనల ప్రకారం ప్రాధాన్యతా క్రమంలో బ్యాంకులకు పంపిస్తున్నాం. ప్రస్తుతం వేతనాలు, విద్యుత్ బిల్లులు, టెలీఫోన్ బిల్లులను ఆమోదిస్తున్నాం. చెల్లించాల్సిన బిల్లుల సంఖ్య 300వరకూ ఉండొచ్చు. అవీ క్రమంగా విడుదల చేస్తున్నాం.

– **ఏ.ధర్మారావు**, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా ఖజానా కార్యాలయం, విజయనగరం



'అబ్కారీ'లో అంతర్యుద్ధం

మొదటి పేజీ తరువాయి

ముడుపులు వెళతాయనే ప్రచా రం ఎన్నో ఏళ్ల నుంచీ ఉన్నదే. అయితే ఇదే దీ బయటకు రాకుండా ఉండటా నికి కారణం వారిలో ఐకమత్యమే. ఎవరైనా ఎదురుతిరిగితే మాత్రం వారంతా ఒక్కటైపోతారు.

పంపకాల్లో తేడాలతో విభేదాలు

ఎక్సైజ్ శాఖలో అధికారుల మధ్య విభేదాలు తలెత్తడానికి ప్రధాన కారణం వారి నెల వారీ పంపకాల్లో తేడాలు రావడమేనని తెలుస్తోం ది. గతంలో ఉన్న డీసీ బదిలీపై వెళ్లిపోయాక మిగతా అధికారులు మామూళ్లను పంచుకునే వారు. అలాగే విజయనగరం, పార్వతీపురం డివిజన్‌లో ఈఎస్, ఏఈఎస్, సీఐలు గ్రూపులుగా విడిపోయి మామూళ్లు వసూలు చేసుకుని నెలకు లక్షలాది రూపాయలు వెనుకేసుకున్నారన్నారంటూ గతంలో వార్తలు వెలువడ్డాయి. యూనియన్ల పేర్లు చెప్పి సొమ్ములు వసూలు చేయడంతోపాటు ఉన్నతాధికారులను బెదిరించి వారి జోలికి రానిచ్చేవారు కాదనే ఆరోపణలూ ఉన్నాయి. నిజానికి ఈ శాఖలో కానిస్టేబుళ్లు, యూనియన్ లీడర్లు సైతం లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారనే అపవాదును మూటగట్టుకున్నారు. ఇటీవల నిర్వహిం చిన మద్యం దుకాణాల కేటాయింపుల లాటరీ నిర్వహణకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు రూ.3లక్షలు పక్కదారి పట్టాయని ఆరోపణలున్నా యి. నవోదయం కార్యక్రమానికి వచ్చే నిధులు అవగాహన కార్యక్రమాలకు ఖర్చు పెట్టాల్సి ఉండగా వాటిని సైతం పక్కదారి పట్టిస్తున్నట్లు వాటాలు అందని కొందరు అధికారులు చెబుతున్నారు.

డీసీతో పట్టింపులు

డీసీగా టి.నాగలక్ష్మి రాకతో ఎక్సైజ్ శాఖలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆమె పద్ధతులు, విధానా ల కారణంగా గ్రూపులు పెరిగి రాజకీయాలు మొ దలయ్యాయి. సింగిల్ విండో విధానం తీవ్ర అసంతృప్తికి దారితీసింది. అది ఆ శాఖలో అధికారుల మధ్య కోల్డ్‌వార్‌కు కారణమైంది. ఒక్కొక్కరు లో లోన ఉన్న అసంతృప్తిని బయటపెట్టడం ప్రారంభించారు. ఉద్దేశ పూర్వకంగానే మీడియాకు లీకులు ఇచ్చారు. కొంత కాలానికి ఆ స్థాయి కూడా దాటిపోయారు. అధికారులు, సిబ్బంది ఒకరిపై ఒకరు బహిరంగంగానే ఆరోపణ లు గుప్పించుకోవడంతో పాటు రాష్ట్ర రాజధానిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. జిల్లా స్థాయిలో డీసీకి వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించారు. ఇంత జరుగుతున్నా ఎక్కడా ఉన్నతాధికారులు కల్పించుకుని ఉద్యోగుల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేయలేదు. చేసేదిలేక డీసీ వ్యక్తిగత సెలవుపై వెళ్లిపోయారు.



ఎక్సైజ్ డీసీ నాగలక్ష్మి

తిరిగొచ్చినా తప్పలేదు

నెలన్నర తరువాత రెండు రోజుల క్రితం వచ్చి విధుల్లో చేరారు. కథ మళ్లీ మొదటికొచ్చింది. ఆమె వస్తే పనిచేయలేమని, మూకుమ్మడిగా సెలవుపై వెళ్లిపోతామంటూ యూనియన్ నాయకులు విజ యవాడ వెళ్లి కమిషనర్‌కు మరోసారి ఫిర్యాదు చేశారు. ఫలితంగా విధుల్లో చేరిన రెండు రోజులకే ఆమె స్థానంలో విశాఖ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఏసీ బాబ్జీకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నాగలక్ష్మిని ప్రస్తుతం గాలిలో ఉంచారు. నిజానికి సెలవు ముగి సిన తర్వాత విధుల్లో చేరినపుడు ఉన్నతాధికారుల కు సమాచారం ఇవ్వకపోవడం, ఆమె రాగానే సిబ్బంది కార్యాలయం నుంచి బయటకు వచ్చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఇక ఆమె ను ఇక్కడ కొనసాగించడం కుదరదన్న నిర్ణయాని కి వచ్చి బాబ్జీకి పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చా రు. ఒక అధికారి సిబ్బంది మొత్తానికి విరోధి కావ డం జిల్లా చరిత్రలో ఇదే తొలిసారి కాగా ఆ స్థాయి అధికారులను సైతం వద్దంటూ సిబ్బంది, యూని యన్లు పట్టుబట్టే పరిస్థితులు రావడం విశేషం.



కస్తూర్బాలో ఇంటర్‌విద్య

మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గ పరిధిలో ఒకే కేజీబీవీ ఉండటంతో ఇక్కడ ఖరారయినట్లే. గజపతినగరం నియోజకవర్గంలో గంట్యాడ, గజపతినగరం, దత్తిరాజేరు, జామి మండల కేంద్రాల్లో కేజీబీవీలు ఉన్నాయి. ఈ నాలుగింటిలో ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది ఎమ్మెల్యే కె.ఎ.నాయుడును సంప్రదించి నిర్ధారించాలని ఎస్ఎస్ఏ పీఓ లక్ష్మణరావుకు మంత్రి మౌఖికంగా ఆదేశించారు. ఈ విద్యాసంవత్సరం నుంచే కళాశాలలను నిర్వహించేలా ప్రవేశాలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రవేశాలపై మల్లగుల్లాలు

మంత్రి ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించినా.. ఈ విద్యాసంవత్సరానికి సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువుతేదీని బోర్డు పలుమార్లు పొడిగిస్తూ చివరికి ఈ నెల 31వ తేదీతో ముగించనుంది. గడువుతేదీ పొడిగించినా చేరడానికి కేజీబీవీగానీ, ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థినులు ఎక్కడా జాయిన్ అవ్వకుండా ఉండాలి. ప్రస్తుతం ఖాళీగా ఉంటారా..? అనేది సమస్య. ఎక్కడైనా జాయిన్ అయినవారు ఇక్కడకు రావాలంటే రిలీవింగ్‌లో అనేక సమస్యలు ఎదురవుతాయి. వీటిని అధిగమించి ఎంతమంది జాయిన్ అవుతారనేదే సందేహం. మరోవైపు కేజీబీవీల్లో ప్రస్తుతం ఉన్న విద్యార్థినులకే గదులు సరిపోవట్లేదు. ఇంటర్ కోర్సుల విద్యార్థినులు వస్తే మరింత ఇబ్బంది తప్పదు.

అరకొర కళాశాలలతో ఎలా?

బడిబయట విద్యార్థినులకు విద్యాబోధనలు అందించాలనే లక్ష్యంతో ఏర్పడిన కేజీబీవీల్లో మాధ్యమిక విద్యను కూడా అందుబాటులోకి తేవాలని ఇంటర్మీడియట్ కోర్సులను ప్రవేశ పెట్టారు. జిల్లాకు రెండు కళాశాలలు ఎలా సరిపోతాయని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 33 కేజీబీవీలున్నాయి. వాటిలో గత ఏడాది దాదాపు వెయ్యిమంది వరకు ఉత్తీర్ణులయ్యారు. ఏటా ఇదే పరిస్థితి. జిల్లాకు వచ్చిన రెండు కళాశాలల్లో నాలుగు కోర్సులు పెడితే కోర్సుకు 40 మంది వంతున కేవలం 320 మందికి మాత్రమే అవకాశం ఉంది. దీంతో రెండు కళాశాలలు లక్ష్యాన్ని తీర్చలేవని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

ఎంపికలోనూ రాజకీయ ప్రాధాన్యం

ఇంటర్మీడియట్ కోర్సులను నిర్వహించడానికి జిల్లాలోని రెండు కేజీబీవీలకే ప్రభుత్వం తొలి విడతగా అనుమతించింది. ఆ రెండింటి ఎంపికలోనూ రాజకీయం చోటుచేసుకుంది. జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గానికి కళాశాలను తీసుకురావడానికి ప్రయత్నించారు. విద్యాశాఖ మంత్రి జిల్లాకి ఇన్‌చార్జ్ కావడం వల్ల ఆయనకు అనుకూలంగా ఉన్న కె.ఎ.నాయుడు, మీసాల గీత నియోజకవర్గాలకే మంజూరు చేశారు. కనీసం రెండు డివిజన్లకు రెండు ఇచ్చినా బాగుండేది. రెండింటినీ ఒకే డివిజన్‌కు కేటాయించడంతో పార్వతీపురం డివిజన్‌కు మొండిచెయ్యి చూపినట్టయింది.





ఇదేం పద్ధతి..!

- వ్యర్థ జలాలు గ్రామంలోకి ఎలా వదులుతారు..?
- వేద బయోఫ్యూయల్ సిబ్బందిని ప్రశ్నించిన గ్రామస్తులు
- ఆందోళనకు దిగిన ప్రజలు
- సర్దిచెప్పిన పోలీసులు



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని నడిపల్లిలో గల వేద బయోఫ్యూయల్ పరిశ్రమ వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిశ్రమ నుంచి విషపూరితమైన వ్యర్థాలు గ్రామంలోకి విడిచిపెట్టడంపై గ్రామస్తులు భగ్గుమన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ బొజ్జ ఈశ్వరమ్మ, వైస్ సర్పంచ్ లంకలపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో



యాజమాన్య ప్రతినిధులతో చర్చిస్తున్న భోగాపురం సీఐ నరసింహారావు

అధిక సంఖ్యలో గ్రామస్తులు పరిశ్రమలోకి ప్రవేశించి వ్యర్థజలాలు వదులుతున్న ప్రాంతాలను పరిశీలించారు. అయితే పరిశ్రమలో ప్రవేశించడానికి అనుమతి లేదంటూ సిబ్బంది గ్రామస్తులను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో గ్రామస్తులు కంపెనీ హెచ్ఆర్ మేనేజర్లు మూర్తి, ఏఎస్ రావులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, గ్రామంలోకి వ్యర్థజలాలు ఎలా విడిచిపెడతారని నిలదీశారు. మీరు ఇలాగే వ్యవహరిస్తే గ్రామాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమకు ఆనుకుని ఉన్న పొలాలు వ్యర్థజలాలు వల్ల నాశనమవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ యాజమాన్యం ఫిర్యాదు మేరకు భోగాపురం సీఐ ఇ. నరసింహారావు, పూసపాటిరేగ, భోగాపురం ఎస్సైలు జి.కళాధర్, తారకేశ్వరరావు, యు .మహేష్ పరిశ్రమ వద్దకు చేరుకుని వ్యర్థజలాలను పరిశీలించారు.

ఎస్సీకాలనీ, సమీపంలో ఉన్న పంట పొలాలను కూడా పరిశీలించి వ్యర్థ జలాలు వల్ల నష్టం జరుగుతున్నట్లు గుర్తించారు.

ఫలించిన చర్చలు

పరిశీలన అనంతరం సీఐ నరసింహారావు కంపెనీ ప్రతినిధులు మూర్తి, ఏస్ రావులతో చర్చలు జరిపారు. వ్యర్థ జలాల నిలిపివేతకు వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చిల్లంగి నెపంతో దాడి

- ఇద్దరికి గాయాలు



గాయాలపాలైన ఊర్మిల, భాస్కరరావు

పార్వతీపురం టౌన్: చిల్లంగి ఉందన్న నెపంతో ఇరువురిపై దాడిచేసిన సంఘటన కొమరాడ మండలం విక్రంపురం పంచాయతీ డంగభద్రలో బుధవారం చోటు చేసుకుంది. పార్వతీపురం ఏరియా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... డంగభద్ర గ్రామానికి చెందిన హిమరిక ఊర్మిల, హిమరిక భాస్కరరావులకు చిల్లంగి ఉందన్న నెపంతో అదే గ్రామానికి చెందిన హిమరిక రామారావు, గౌరమ్మలు బుధవారం కర్రలతో దాడిచేశారు. ఈ దాడిలో ఊర్మిల, భాస్కరరావులకు గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరిద్దరూ పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నీలవేణి

పార్వతీపురం టౌన్: భర్త మద్యం తాగడంతో మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పార్వతీపురం ఏరియా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కురుపాం మండలం గుజ్జువాయి పంచాయతీ మంటికొండ గ్రామానికి చెందిన ఊయక నీలవేణి తన భర్త మద్యం సేవించి ఇంటికి రావడంతో మనస్తాపం చెందిన ఇంటిలో ఉన్న మాత్రలను ఎక్కువ మోతాదులో మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు మొండెంఖల్ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం అక్కడ కోలుకుంటోంది.

రాజేశ్వరిది ముమ్మాటికీ హత్యే..

- నెల్లిమర్ల పోలీస్ స్టేషన్ వద్ద మృతురాలి బంధువుల ఆందోళన



రహదారిపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

నెల్లిమర్ల: రాజేశ్వరిని హత్య చేశారని ఆరోపిస్తూ మృతిరాలి బంధువులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టి, నిందుతలకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఈ నెల 26న ఉదయం 10 గంటలకు తమ ఇంటి నుంచి నెల్లిమర్లలోని అత్తవారింటికి రాజేశ్వరి వెళ్లిందన్నారు. వెంటనే కట్నం తేవాలంటూ అత్త, ఆడపడుచు రాజేశ్వరిపై విరుచుకుపడినట్టు స్థానికులు తెలిపారన్నారు. అక్కడకు కొద్దిసేపటికి తమ అమ్మాయి చనిపోయినట్టు వర్తమానం అందిందని, వారు కావాలనే చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని వాపోయారు. ఇంతలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీ ఏవీ రమణ మృతురాలి బంధువులతో మాట్లాడారు. అదనపు కట్నం కోసం వేధించినట్లుగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని చెప్పారు. పోస్టుమార్టం రిపోర్టు రానందున ఇంకా ఎవ్వరినీ అరెస్ట్ చేయలేదన్నారు. నిందితులెవ్వరినీ వదిలేది లేదని చెప్పడంతో మృతురాలి బంధువులు ఆందోళన విరమించారు.

ఖైనీ ప్యాకెట్ల పట్టివేత



ఖైనీ ప్యాకెట్లు, నిందితుడితో ఎస్సై డీడీ నాయుడు

రామభద్రపురం: జిల్లాలో ఖైనీ,గుట్కా అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పలుమార్లు పోలీసులు, విజిలెన్స్ అధికారులు పట్టుకున్నా ఇంకా రవాణా తగ్గడం లేదనే చెప్పాలి. తాజాగా మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో మండల కేంద్రంలో సుమారుగా రూ.85 వేల విలువ చేసే ఖైనీ ప్యాకెట్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై డీడీ నాయుడు తెలియజేసిన వివరాల ప్రకారం..

మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన పొట్టా గున్నేశ్వరరావు ఒడిశా రాష్ట్రం సుంకి నుంచి ఖైనీ ప్యాకెట్లు సాలూరు వరకు లారీలో తీసుకొచ్చి అక్కడ నుంచి అదే గ్రామం డబ్బీవీధికి చెందిన నడిపల్లి శ్రీను ఆటోలో తీసుకువస్తుండగా, మండల కేంద్రంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఆటోతోపాటు సరుకును సీజ్ చేసిన పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా..



బోల్తాపడిన లారీ



విరిగిన విద్యుత్ స్తంభాలు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని వెంకటరమణపేట శివారు రైల్వే క్రాసింగ్ గేటు వద్ద క్రషరుబుగ్గి లోడుతో ఉన్న లారీ బుధవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో పాటు సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైంది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు ప్రధాన జంక్షన్ నుంచి వెంకటరమణపేట పంచాయతీ శివారు మల్లిపూడి వరకు బీటీ రోడ్డు మంజూరైంది. ఈ రోడ్డు పనులకు సంబంధించి ఏపీ 31వై 9666 నంబర్ గల లారీ క్రషర్ బుగ్గి తీసుకువచ్చింది. క్వారీ రోడ్డులో గల రైల్వే క్రాసింగ్ గేట్ వద్ద లారీ నిలిపివేసి డ్రైవర్ మధ్యాహ్న భోజనానికి వెళ్లాడు. అయితే పార్కింగ్ చేసిన ప్రాంతం ఏటవాలుగా ఉండడంతో లారీ వెనక్కి జరిగి పొలంలో బోల్తా పడింది. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొనడంతో మూడు విద్యుత్ స్తంభాలు, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపోయాయి. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని క్వారీ కార్మికులు, రైల్వే గేట్‌మెన్ చెబుతున్నారు. అయితే లారీ బోల్తా పడిన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఇదిలా ఉంటే విద్యుత్ శాఖ ఏఈ వై.సురేష్‌కుమార్, పోలీసు హెచ్‌సీ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ, విద్యుత్‌శాఖకు సుమారు రూ.75వేల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యం

మేషం: పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

వృషభం: శ్రమాధిక్యం. పనుల్లో తొందరపాటు. ప్రయాణాలలో అవాంతరాలు. వ్యయ ప్రయాసలు. బంధువులతో తగాదాలు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.



మిథునం: చిరకాల స్వప్నం నెరవేరుతుంది. విద్యావకాశాలు. ప్రముఖులతో పరిచయాలు. పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహం.

కర్కాటకం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఆర్థిక ప్రగతి. పరిచయాలు పెరుగుతాయి. శుభవార్తలు. వాహనయోగం. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు.

సింహం: పనుల్లో అవాంతరాలు. వృథా ఖర్చులు. బంధువులతో మాటపట్టింపులు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళ పరిస్థితి.

కన్య: కొన్ని సమస్యలు వేధిస్తాయి. ఆరోగ్యభంగం. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూరప్రయాణాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

తుల: పరిచయాలు పెరుగుతాయి. ఆసక్తికర సమాచారం. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. ఉద్యోగావకాశాలు. వృత్తి, వ్యాపారాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

వృశ్చికం: కుటుంబ, ఆరోగ్యసమస్యలు. వ్యయప్రయాసలు. ఆదాయానికి మించిన ఖర్చులు. ప్రయాణాలు వాయిదా. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహం.

ధనుస్సు: చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. కార్యజయం. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు పదోన్నతులు.

మకరం: శ్రమ పెరుగుతుంది. ఆకస్మిక ప్రయాణాలు. ఇంటాబయటా ఒత్తిడులు. దైవ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో నిరాశ.

కుంభం: పలుకుబడి పెరుగుతుంది. శుభవార్తలు. వాహనయోగం. చర్చలు ఫలిస్తాయి. వస్తులాభాలు. వ్యాపారాలలో పురోగతి. ఉద్యోగులకు విధుల్లో చికాకులు తొలగుతాయి.

మీనం: పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల సాయం అందుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూలత.

– సింహంభట్ల సుబ్బారావు

సేవలు

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం	శుక్రవారం	శనివారం	ఆదివారం
సంస్కృతి	రైల్వే	ప్రజావసరాలు	మనకోసం	లైఫ్ స్టైల్	షాపింగ్	రవాణా

పట్టణంలోని పలు బ్యూటీ సెంటర్లు, జిమ్‌లు

శ్రీ బ్యూటీ క్లినిక్	9059542106
అక్షయ బ్యూటీ క్లినిక్	9441158843
ఆకర్షణ ఒబెసిటీ బ్యూటీ క్లినిక్	9848613188
పూనమ్ బ్యూటీ క్లినిక్	6441149204
రమాస్ బ్యూటీ క్లినిక్	7386789334
క్రేజీ బ్యూటీ పార్లర్ (మెన్స్)	9440311174
అనూశ్రీ బ్యూటీ క్లినిక్	9885532341
గగన్ జిమ్ (లేడీస్)	7032494019
జెకె బ్యూటీ క్లినిక్	9849810996
చందన్ హెర్బల్ బ్యూటీ క్లినిక్	08922-233839
ఫెయిర్ స్పా	8099998406
అమృత బ్యూటీ అండ్ స్లైలింగ్	9490139994
స్వాతీస్ బ్యూటీ క్లినిక్	8347068470
లాలిత్యా బ్యూటీ క్లినిక్	9392394079
శ్రీ సిద్దాస్ బ్యూటీ క్లినిక్	9290013265
గాయత్రీ బ్యూటీ పార్లర్	9966628176
నేహాస్ బ్యూటీపార్లర్	9885729832
శ్రీ దుర్గా బ్యూటీకేర్	9949150215
స్నిగ్ధ హెర్బల్ బ్యూటీపార్లర్	7396331787
మేఘనాస్ బ్యూటీక్లీనిక్	9966622556
షేర్ జీనియస్	08922-221394
ఆక్వా మల్టీ జిమ్	9703959909
స్లిమ్ జిమ్	08922-225454
బాడీలైన్ జిమ్	08922-551180

ఆస్పత్రి ఫోన్ నెంబర్లు

ఆస్పత్రి పేరు	ఫోన్ నెంబరు
సాయి ఆస్పత్రి	944193650
వెంకటరామ ఆస్పత్రి	08922-236759
సిటిస్కాన్ డయోగ్నోస్టిక్స్	08922-222022
వెంకటాద్రి ఆస్పత్రి	9440018606
సాయి రమ్య ఆస్పత్రి-	9440120277
వెంకటపద్మ ఆస్పత్రి	7702612346
తిరుమల ఆస్పత్రి	08922-232626
ఇందిరనర్సింగ్‌హోమ్	9440070879
దంత వైద్యులు కామేష్	9440074890
జెసీస్కాన్ డయోగ్నోస్టిక్స్	9390028859

మిమ్స్ సమాచారం

- మిమ్స్ జనరల్ అసుపత్రిలో అందించే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల వివరాలు ఇలా ఉన్నాయి.
- డాక్టర్ ఎన్.రవికుమార్–యూరాలజీ–ప్రతిరోజు అందుబాటులో ఉంటారు
- డాక్టర్ ఎం.శ్రీనివాసరావు–పీడియాట్రిక్ సర్జన్–ప్రతి శుక్రవారం
- డాక్టర్ జగన్నాధరాజు–కార్డియాలజీ–ప్రతి బుధవారం
- డాక్టర్ బి.అనిల్‌కుమార్–కార్డియాలజీ–ప్రతిరోజు అందుబాటులో ఉంటారు
- డాక్టర్ పి.శ్రీరామ్‌నవీన్–నెఫ్రాలజీ–ప్రతి గురువారం
- డాక్టర్ ఏ.కుమార్–నెఫ్రాలజీ– సోమ, బుధ, శుక్రవారాల్లో అందుటులో ఉంటారు
- డాక్టర్ బి.దేవుడుబాబు–న్యూరోసర్జన్–ప్రతి బుధవారం
- డాక్టర్ మొహమ్మద్ అక్బర్–గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్–ప్రతి గురువారం
- డాక్టర్ ఐ.నరేష్‌కుమార్–గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్– ప్రతిరోజు అందుబాటులో ఉంటారు
- డాక్టర్ సాయి సునీల్‌కిషోర్–ప్రతి శుక్రవారం

విద్యుత్ శాఖ

ఎస్ఈ	227036, 226327, 9440812447
డిఈ (టెక్నికల్)	224291, 9440812448
డిఈ (విజయనగరం)	222150, 226020, 9440812449
ఎడిఈ (విజయనగరం)	226929, 9440812455
ఏఈ (విజయనగరం)	9440812450
ఇఆర్ఓ (విజయనగరం)	224135,
విటి.అగ్రహారం సబ్ స్టేషన్	255643
సెక్షన్ ఆఫీసర్ విటి.అగ్రహారం	255843
కంట్రోల్ రూమ్	222943
బంక్ నెం.1	226944
బంక్ నెం.2	226945
బంక్ నెం.3	226946
బంక్ నెం.4	226947
కాల్ సెంటర్	155333

రామతీర్థం ఆలయ సమాచారం



రామతీర్థం ఆలయంలో స్వామి వారి పూజలు, దర్శన వివరాలు.. ప్రతిరోజూ వేకువజామున ఐదు గంటలకు ఆలయం తెరిచి 6.30 గంటల వరకు సుప్రభాతం, తీర్థబిందె, శుద్ధి, తిరువారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం 6.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, మంగళాశాసనం కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం 11.30 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు సీతారాముల నిత్యకల్యాణం జరుగుతుంది. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు రాజభోగం ఉంటుంది. మధ్యాహ్నం 12.15 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు రాత్రిభోగం, మంగళాశాసనం, పవళింపుసేవ కార్యక్రమాలుంటాయి.

- నెల్లిమర్ల

విజయనగరం వాతావరణం

గరిష్టం	కనిష్టం
32.6°	26.5°

నేడు : అడపాదడపా వానపడవచ్చు. గాలులు వీయవచ్చు. ఆకాశం మేఘావృతమై ఉదయం, మధ్యాహ్నం వేడిగా ఉండవచ్చు. గరిష్టం 33డి. కనిష్టం: 27డి.

రేపు : తేలికపాటి వాన పడవచ్చు. ఆకాశం మేఘావృతమై ఉదయం కాస్త వేడిగా, మధ్యాహ్నం ఉక్కపోతగా ఉండవచ్చు. గరిష్టం 32 డి. కనిష్టం: 26డి.

శనివారం: ఒకటి, రెండు విడతల వాన పడవచ్చు. ఆకాశం మేఘా వృతమై ఉదయం హాయిగా, మధ్యాహ్నం అనుకూలంగా ఉండవచ్చు. గరిష్టం: 30డి. కనిష్టం:25డి.

ఎమర్జెన్సీ సర్వీసెస్

పోలీస్	100
అపదసమయంలో	108
బాలలసంరక్షణకోసం	1098
ఫైర్	101

చికెన్ ధరలు (కిలో) (బ్రాయిలర్)

లైవ్	డ్రెస్డ్(విత్‌స్కిన్)	స్కిన్‌లెస్
రూ. 100	రూ. 170	రూ. 180

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100)

విశాఖపట్నం	362–00
విజయనగరం	366–00
శ్రీకాకుళం	366–00

బులియన్

విశాఖపట్నం

బంగారం (24సి. 10గ్రా)	30,350
బంగారం (22సి. 10గ్రా)	28,230
వెండి కిలో	40,900

మీ కోసం

స్కిల్ టెస్ట్‌లు నేడు

విజయనగరం అర్బన్: జాతీయ అన్వేషికా భౌతికశాస్త్ర ప్రయోగ నైపుణ్యతపై రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న 'నేషనల్ ఎక్స్‌పరిమెంటల్ స్కిల్ టెస్ట్(నెస్ట్)'ను గురువారం స్థానిక మహారాజా అటానమస్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపీటీ) అన్వేషిక రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఏపీటీ, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహారాజా అటానమస్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయి విజేతలు పాల్గొంటారన్నారు.

ఉపకార వేతనాలకు గడువు పెంపు

విజయనగరం కంటోన్మెంట్: మైనార్టీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించినట్లు మైనార్టీ కార్పొరేషన్ ఈడీ మహ్మద్ షంషుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పుల కోసం ఫ్రెష్ విద్యార్థులకు ఈ గడువు వర్తిస్తుందని పేర్కొన్నారు. రెన్యువల్ విద్యార్థులకు మాత్రం ఆగస్టు 31తో గడువు ముగుస్తుందన్నారు. మరిన్ని వివరాలకు 08922–230250, 9849901160 నంబర్లను సంప్రదించాలన్నారు.

టీటీడీ సమాచారం



తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	ఖాళీ లేవు
రూ.100 గదులు	–	ఖాళీ లేవు
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ	–	250 ఖాళీ
వసంతోత్సవం	–	150 ఖాళీ
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	200 ఖాళీ

గురువారం ప్రత్యేక సేవ : తిరుప్పావడ

బుల్లితెర

www.sakshi.com

సాక్షి TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30	నిరీక్షణ
ఉ.07.00	న్యూస్ 360
ఉ.07.30	కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00	రీజనల్ న్యూస్
ఉ.09.30	మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30	స్క్రీన్‌ప్లే
ఉ.11.30	పొలిటికల్ కారిడార్
మ.02.30	డాక్టర్స్ టైమ్
సా.04.30	మార్గం
సా.05.00	స్పీడ్ న్యూస్
సా.05.30	ఉర్దూ న్యూస్
రా.07.30	పొలిటికల్ కారిడార్
రా.08.00	ఫోర్త్ ఎస్టేట్
రా.09.00	న్యూస్ 360
రా.09.30	మ్యాగజీన్ స్టోరీ
రా.10.30	స్క్రీన్‌ప్లే
రా.11.30	న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 గూఢచారి 117
ఉ.09.30 శేషాద్రి నాయుడు
మ.12.00 పోస్ట్‌మ్యాన్
మ.03.00 శ్రీమతీ వెళ్లొస్తా
సా.06.00 ఆంధ్రుడు



మూవీస్ నౌ
ఉ.08.20 స్పిసిస్
ఉ.10.20 క్లిఫ్ హ్యాంగర్
మ.02.45 రష్ అవర్ 3
సా.05.55 సూపర్‌మాన్ రిటర్న్స్
రా.09.00 టాయ్ స్టోరీ




హెచ్‌బీవో
ఉ.08.09 ఘోస్ట్ షిప్
ఉ.09.42 ఫూల్స్ గుడ్
ఉ.11.38 కుంగ్‌ఫు పాండా 2
సా.05.10 ఐపీ మ్యాన్ 3
రా.07.00 ద అకౌంటెంట్



సోనీ పిక్స్
ఉ.0626 సెంటర్ స్టేజ్
ఉ.11.26 బ్యాటిల్‌షిప్
మ.01.47 ద ఇంక్రెడిబుల్ హల్క్
సా.06.13 వాటర్‌వరల్డ్
రా.09.00 జురాసిక్ పార్క్



మా మూవీస్
ఉ.07.00 పెద్దోడు చిన్నోడు
ఉ.09.00 ఆనంద్
మ.12.00 షాక్
మ.03.00 ఎందుకంటే ప్రేమంట
సా.05.00 సింగం



జీ సినిమా
ఉ.07.50 ఆవారా పాగల్ దీవానా
ఉ.10.54 ఐ
మ.02.42 సిర్ఫ్ తుమ్
సా.05.41 హసీనా మాన్ జాయేగీ
రా.09.00 నామ్ షబానా

ఇవి కలెక్టరేట్ రోడ్లే..

- మూడు వైపులా అధ్వాన రహదారులు
- రాకపోకలకు ఇబ్బంది



పడమర వైపు పాడైన రోడ్డు



గోతుల్లో చేరిన నీరు

విజయనగరం, గంటస్తంభం:

జిల్లా కలెక్టరేట్... జిల్లా అంతటికీ పరిపాలనా కేంద్రం. వివిధ శాఖల కార్యాలయాలు దాదాపుగా అన్నీ ఇక్కడే కొలువుతీరాయి. జిల్లా అధికారులు ని త్యం వచ్చి వెళ్తుంటారు. వీరితోపాటు పాలక ప్రముఖులు అప్పుడప్పుడు వచ్చి పోతుంటారు. కానీ అక్కడ మౌలిక సదుపాయాల కల్పనలో మాత్రం అధికారులు చిత్తశుద్ధి కనబరచడం లేదు. అభివృద్ధికి ఆదర్శంగా నిలవాల్సిన కలెక్టరేట్ అం దు కు భిన్నంగా ఉంది. కార్యాలయానికి వెళ్లే రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. నాలుగువైపులా ఉన్న తారురోడ్లు ఐదారేళ్ల కిందటే పాడయ్యాయి. ఇంత వరకు బాగుచేయకపోవడంతో రోడ్లు రాళ్లు తేలి, గోతులతో దర్శనమిస్తున్నాయి. అయితే ఇటీవల కలెక్టర్, జేసీ, జేసీ-2, ఏజేసీలు వచ్చే మార్గంలో మాత్రం తారురోడ్డు వేశారు. దీంతో తూర్పు భాగాన ఉన్న రోడ్డు తప్పితే మిగిలిన మూడువైపుల రోడ్లు గోతులతో అస్తవ్యస్తంగా మారా యి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలకు అటు అధికారులు, ఇటు వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహన దారులైతే ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులను బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో చదును చేసిన స్థలం

విజయనగరం టౌన్: పట్టణంలోని కొత్తపేట అనాసరపు వీధిలో ఉన్న మన్నార్ రాజగోపాలస్వామి ఆలయానికి సంబంధించి సర్వే 944లో 5400 చదరపు అడుగుల ఆక్రమణలను బుధవారం తొలగించినట్లు ఆలయ ఈఓ రమణ తెలిపారు. రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కి ఎదురుగా ఉన్న ఈ ఆక్రమణల స్థలాల్లో ఉన్న పది షాపులను, ఇంటిని బుధవారం చదును చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవాలయాల పరిరక్షణలో భాగంగా ఆక్రమణలు తొలగించమని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆంగ్ల భాషే కీలకం'

విజయనగరం అర్బన్: యువతలో కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపడడానికి ఆంగ్ల భాషపై పట్టు కీలకమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం స్థానిక మహారాజా డిగ్రీ కళాశాలలో 'ఆంగ్లభాష – ఆవశ్యకత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎ. సత్యవతి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆంగ్ల విభాగం అధిపతి సీహెచ్ నరేన్‌కుమార్, అధ్యాపకులు ఎ.ప్రవల్లిక, పి.దాలినాయుడు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

విజయనగరం టౌన్: పట్టణంలోని నాగోజీపేటలో గల లార్డ్ కిచినర్ పురపాలక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లిఫ్టింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు బుధవారం నోట్‌బుక్స్, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ హెల్ప్ డెస్క్ ఏఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులకు ఉపాధ్యాయులు నైతిక విలువలు నేర్పాలన్నారు. సంస్థ అధ్యక్షుడు కంది గౌరీకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎస్.అచ్చిరెడ్డి,ప్రధాన కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, సహాయ కార్యదర్శి మంజుల, సభ్యులు దూరి సతీష్ , సురేష్, కోలక ప్రవల్లిక, అంధవరపు ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి..

- సత్య కళాశాల ప్రిన్సిపల్ సాయిదేవమణి



యాప్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై గోపాలకృష్ణ

విజయనగరం టౌన్: దొంగతనాల నివారణకు గాను పోలీస్‌శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన లాక్ట్ హౌస్ మోనటరింగ్ సిస్టిమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తోటపాలెం సత్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి పిలుపునిచ్చారు. వన్‌టౌన్ ఎస్సై గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనాలను అరికట్టేందుకు పోలీస్ వ్యవస్థ అద్భుతమైన యాప్‌ను తీసుకురావడం హర్షణీయమన్నారు. అనంతరం యాప్‌ను సెల్‌లో ఎలా పొందుపరుచుకోవాలి.. ఎలా వినియోగించుకోవాలన్న దానిపై ఎస్సై వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశా...



మట్టి వినాయకుడిని పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. మట్టి గణపతికి జేజేలు పలుకుదాం. మరి మీరూ మట్టిగణపతినే పూజిస్తున్నారా.. మీ వీధిలోగానీ... మీ ఇంట్లోగానీ మట్టి విగ్రహంతో సెల్ఫీతీసి 9553955798 నంబర్‌కు వాట్సాప్‌లో పంపండి. మంచిగా ఉన్నవాటిని సాక్షి ప్రచురిస్తుంది. మీ చిరునామా... ఫోన్ నంబర్ మరచిపోకండేం...

మట్టి మేలు తలపెట్టవోయ్



ఎస్‌ఎం గౌరీశంకర్, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, తోటపాలెం, విజయనగరం



ఆర్.హర్షవర్ధన్ సాయి లలితానగర్ కాలనీ, కేఎల్‌పురం, విజయనగరం

పాడి-పంట

లాభాల మునగ

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- ఆసక్తి కనబరుస్తున్న రైతన్నలు

విజయనగరం ఫోర్ట్:

మునగ సాగులాభదాయకంగా ఉండడంతో రైతులు మునగసాగు పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. మునగ సాగు విధానం గురించి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కె. లక్ష్మణ్ ఈ విధంగా తెలిపారు. తక్కువ సమయంలో ఆదాయం ఇచ్చే పంటల్లో మునగ పంట ఒకటి. ఈ మునగ పంట ఇతర పంటల కంటే అధిక ఆదాయాన్ని ఇస్తుంది.

రకాలు: పికేఎం-1,2, జీకెవీకె-123, కే-1 ముఖ్యమైనవి. వీటిలో పీకేఎం-1ను అధికంగా సాగు చేస్తారు. చెట్లు 6 మీటర్లు ఎత్తు పెరుగుతాయి. మొదటి కోత 130 నుంచి 175 రోజులకు వస్తుంది. ఒక్కో చెట్టుకు 250 నుంచి 275 కాయలు కాస్తాయి. కాయ మంచి కండ కలిగి 90 నుంచి 100 సెంటీ మీటర్ల పొడవుతో 140 గ్రాముల బరువు ఉంటుంది.

నాటే విధానం: పొలాన్ని దుక్కి దున్నిన తరువాత ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు వేసి భూమిలో కలియ దున్నాలి. పొలంలో 2.5 లేదా 3మీటర్లు దూరంలో 45/45/45/ఘనపు సెంటీ మీటర్ల గోతులు తీయాలి. ఎకరాకు 650 నుంచి 675 మొక్కలు నాటుకోవాలి.

నీటి యాజమాన్యం: మొక్కలు నాటిన వెంటనే నీరు పెట్టాలి. నేల వాతావరణ పరిస్థితులను బట్టి 7 నుంచి 10 రోజులకు ఒకసారి నీటి తడులు అందించాలి. మునగ నీటిఎద్దడిని బాగాతట్టుకుని నిలబడుతుంది. కాపు కాసే సమయంలో 4 నుంచి 5 రోజులకు ఒకసారి నీటి తడి అందిస్తే దిగుబడి పెరుగుతుంది.

మొక్కల పెంపకం: విత్తనం నాటి సాగు చేయడం సులభమైన పద్ధతి. కొమ్మల ద్వారా కూడ ప్రవర్ధనం చేయవచ్చు. ఎకరాకు 250 నుంచి 300 గ్రాములు విత్తనాలు సరిపోతాయి. కేజీకి 2500 నుంచి 2600 గింజలు తూగుతాయి. మొక్కలు పెంచడానికి 5/9 అడుగుల పాలిథీన్ కవర్లలో మట్టి, పశువులు ఎరువు, ఇసుక 2:1:1 నిష్పత్తిలో కలిపి నీరు పోయాలి. ఆరిన తరువాత ఒక్కొక్క సంచిలో ఒక్కొక్క విత్తనం చొప్పన రెండు సెంటీమీటర్ల లోతులో నాటాలి. పాలిథీన్ సంచిలో నుంచి నీరు పోయడానికి కింది భాగంలో 6 నుంచి 8 రంధ్రాలు చేయాలి. రోజు సంచులకు అవసరం మేరకు నీరు పోయాలి.

ఇలా చేస్తే మంచి దిగుబడి: మొక్కలు మూడు అడుగులు పెరిగిన తరువాత కొన చివర్లను తుంచి వేయాలి. దీని వల్ల పక్క కొమ్మలు వృద్ధి చెందుతాయి. పక్కకొమ్మలు కూడా 1నుంచి 2 అడుగులు పెరిగే లోపల మళ్లీ చిగుర్లు తుంచితే మరింతగా కొమ్మలు పుడతాయి. దీనివల్ల కొమ్మలు అన్నింటికీ కాయలు కాసి ఆదాయం పెరుగుతుంది.


సాగులో ఉన్న మునగచెట్ట

ఎరువులు యాజమాన్యం: మునగ మొండిజాతి మొక్క అయినా అధికదిగుబడులకు ఎరువులు అవసరం. మొక్కలు నాటేటప్పుడు 10 కిలోల పశువుల ఎరువులు, 250 గ్రాముల వేపపిండి, 250 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. నాటిన 3, 6, 9 నెలలకు ఒక్కొక్క మొక్కకు 100 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) వేసి నీటి తడులు అందించాలి.

దిగుబడి: మొక్కలు నాటిన 90 నుంచి 100 రోజుల్లో పూత ప్రారంభమవుతుంది. కాయలు ముదరకముందే కోయాలి. కోసిన వెంటనే సంచిలో మార్కెట్‌కు తరలించాలి. ఒక్కోచెట్టుకు 250 నుంచి 275 కాయలు లభిస్తాయి.

కొమ్మలను కత్తిరిస్తు ఉండాలి:

మొదటి పంటను తీసుకున్న తరువాత నేల నుంచి మొక్కలను మూడు అడుగులు వదిలి కత్తిరించాలి. దీనిపైన కొమ్మలు వస్తాయి. ఎరువులు వేసి మట్టిని ఎగదోయాలి. నెల రోజులు తరువాత ఒక్కొక్క మొక్కపై 5, 6 కొమ్మను ఉంచి మిగిళిన వాటిని తీసి వేయాలి. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మూడు సంవత్సరాల పాటు పంట తీసుకోవచ్చు.

హక్కుల పరిరక్షణకు ట్రాయ్ నిరంతర కృషి

- ట్రాయ్ అధికారులు మురళీధర్, మూర్తి

విజయనగరం టౌన్: టెలికమ్ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు టెలికమ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా కృషిచేస్తోందని ఆ సంస్థ అధికారులైన అడ్వయిజర్ జి.మురళీధర్, సీనియర్ రీసెర్చ్ అధికారి పీఎస్ఆర్.మూర్తి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఓ హోటల్‌లో జరిగిన వినియోగదారుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కాలానుగుణంగా సాంకేతికంగా వచ్చే మార్పులకు అనుగుణంగా వినియోగదారులకు ఇబ్బంది లేకుండా వివిధ సర్వీస్ ప్రొవైడర్లు అందించే సేవలను రెగ్యులేట్ చేస్తూ తగు సూచనలు జారీ చేస్తున్నామన్నారు. కొన్ని సర్వీస్ ప్రొవైడర్ల సేవలు సక్రమంగా లేవన్న ఫిర్యాదుల మేరకు మొబైల్ నెంబర్ పోర్టుబులిటీని కల్పించామన్నారు.

బిల్లులు ఇవ్వాల్సిందే...

టీవీ, సెట్‌టాప్ బాక్సులకు ప్రతి నెలా చెల్లించే కేబుల్ కనెక్షన్ చార్జీలకు సంబంధిత ఎమ్ఎస్ఓలు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాల్సిందేనని ట్రాయ్ ప్రతినిధులు స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి జిల్లాలో సంయుక్త కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. వారికి పిర్యాదుచేయవచ్చన్నారు. ఏదైనా నెట్‌వర్క్ సమస్యలకు కాల్ సెంటర్‌కు ఫిర్యాదుచేసి పరిష్కారం పొందవచ్చని, ఒకవేళ పరిష్కారం దొరక్కపోతే అప్పిలేట్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్ మోసాలపై పలు ఫిర్యాదులు ట్రాయ్ దృష్టికి వచ్చినందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. సదస్సులో బీఎస్ఎల్ఎల్, ఎయిర్‌టెల్, ఐడియా, రిలయన్స్, ఒడాఫోన్, టాటా తదితర సర్వీస్ ప్రొవైడర్ల ప్రతినిధులు, వివిధ ఎమ్ఎస్ఓల ప్రతినిధులు, విద్యార్థులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భోజన పథక నిర్వహణను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం

- మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీధర్

విజయనగరం అర్బన్: మధ్యాహ్న భోజన పథక నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే ఆలోచన ప్రభుత్వం మానుకోవాలని మధ్యాహ్న భోజన పథక నిర్వహణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీధర్ ప్రకటించారు. ప్రభుత్వం మొండి చేస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. స్థానిక అమర్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని ఐదు ప్రాంతాలను క్లస్టర్‌గా విడగొట్టి ఆయా ప్రాంతాలకు ప్రైవేటు వ్యక్తులకు వంటబాధ్యత ఇవ్వాలనే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, అలా చేస్తే జిల్లాలో సుమారు 5 వేల మంది మహిళలు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా యథావిధిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నూతనంగా నిర్వహిస్తున్న గుడ్ల పంపిణీ వ్యవహారం బాగోలేదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పెంచి లక్ష్మి, కోశాధికారి ఉంగరాజుల జయలక్ష్మి, వివిధ మండలాల నుంచి సంఘం సభ్యులు హాజరయ్యారు.

వర్ష బీభత్సం

ఉరుములు మెరుపులతో ఎస్‌కోటలో హోరు వాన



ఎస్.కోటలో వర్షబీభత్సం దృశ్యాలు

శృంగవరపుకోట: హడావిడి లేకుండా బుధవారం సాయంత్రం కమ్ముకున్న కారు మేఘాలతో వాన ముంచేసింది. ఊరువాడ వాగువంకను ఒకటిగా చేసి చెరువులను తలపించింది. ఉరుములు.. మెరుపులకు తోడు కుండపోతగా కురిసిన వర్షం జనాన్ని ఒక్కసారిగా భయభ్రాంతులకు గురిచేసింది. ఎస్.కోట పట్టణంలో సాయంత్రం ఐదు గంటలనుంచి ఆరుగంటలవరకు సుమారు గంటపాటు కురిసిన వర్షం దాటికి ఎస్.కోట చిగురుటాకులా వణికింది. విశాఖ.. అరుకురోడ్డులో ఉన్న కుళ్లికోనేరుకు గండి పడి రహదారిపై మోకాలు లోతు నీరు ఉధృతంగా ప్రవహించటంతో ట్రాఫిక్ స్తంభించిపోయి రహదారికి ఇరువైపులా వాహనాలు బారులుతీరాయి. పుణ్యగిరి గెడ్డ పొంగడంతో శ్రీనివాసకాలనీలో సర్వేపల్లి రోడ్డులో నడుంలోతు వర్షపునీరు చేరింది. గౌరీనగర్, జలారీదిబ్బ, వన్‌వే జంక్షన్ వద్ద వర్షపునీరు రోడ్డుపై పొంగిపొర్లింది. పట్టణంలో పలు చోట్ల లోతట్టు ఇళ్ల ప్రాంతాల్లో వర్షపునీరు చొచ్చుకుపోయింది.



పోటెత్తిన వట్టిగెడ్డ..

వట్టిగడ్డ.. ఇందులో ఎప్పుడూ నీరుండకపోవడంతో ఉత్తిగడ్డ అని పిలుస్తుంటారు. దీనివల్ల రైతాంగానికి కూడా ఎటువంటి ఉపయోగం ఉండదని చిన్నచూపు చూస్తుంటారు. అటువంటి వట్టిగెడ్డ ప్రస్తుతం ఉరకలెత్తి ప్రవహిస్తోంది. సామర్థ్యానికి మించి నీరు చేరడంతో కిందకు విడిచిపెడుతున్నారు. దీంతో పిల్ల కాలువలు నీటితో కళకళలాడుతుండగా, రావాడ సమీపంలో ఉన్న కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహించడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అలాగే రెండు,మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని పలు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.


జియ్యమ్మవలస: కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న నీరు

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ సమీపంలో ఉన్న వట్టిగెడ్డ నీటితో కళకళలాడుతోంది. రిజర్వాయర్ సామర్థ్యం 398 క్యూసెక్కులు కాగా, ఇన్‌ఫ్లో ఎక్కువగా వస్తుండడంతో అధికారులు కిందకి నీరు విడిచిపెట్టారు. ఈ క్రమంలో రావాడ సమీపంలో ఉన్న కాజ్‌వై పైనుంచి నీరు ప్రవహించింది. దీంతో కాజ్‌వే ఆవల ఉన్న నాలుగు పంచాయతీల గిరిజనులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. బుధవారం నాటి పరిస్థితి అయితే మరీ దారుణంగా తయారైంది. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు కాజ్‌వే దాటలేక వెనక్కి వెళ్లిపోయారు. అలాగే కొండచిలకాం, నిడగళ్లగూడ, బాప్పన్నగూడ, చాపరాయిగూడ, టీకే జమ్ము, పిటిమండ, నడిమిసిరిపి, పల్లపుసిరిపి, తదితర గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కాజ్‌వే సమీపంలో వంతెన నిర్మించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా ఏ ఒక్కరూ స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త, చెదారం తీయకపోవడమే..

కాజ్‌వే కిందనున్న పైపుల్లో చెత్త, చెదారాలు తీయకపోవడం వల్లే నీరు సరిగ్గా ప్రవహించడం లేదని స్థానికులు చెబుతున్నారు. రిజర్వాయర్ నుంచి ఏ మాత్రం నీరు విడిచిపెట్టినా కాజ్‌వేపైకి చేరుకుంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాజ్‌వే దిగువన ఉన్న పైపులలో పూడికతీత పనులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

కుండపోత



గంట్యాడ: మండలంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో గింజేరు డొంకల గెడ్డ ఉద్ధృతంగా ప్రవహించింది. దీంతో లక్కిడాం నుంచి పెద్ద వసంత, చంద్రంపేట నుంచి చిన వసంత గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. చంద్రంపేట రైతుల కళ్లాలు గెడ్డ ఆవల ఉండడంతో పశువులకు కనీసం మేత కూడా వేయలేకపోయారు.

గంట్యాడ: గింజేరు సమీపంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న డొంకల గెడ్డ

‘ఉద్దేశపూర్వకంగానే చిన్న గుడ్లు’


చిన్న గుడ్డును చూపిస్తున్న ఆహార సలహా సంఘ సభ్యుడు ముద్దాడ మధు

విజయనగరం కంటోన్మెంట్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి కాంట్రాక్టర్లు కావాలనే చిన్నగుడ్లు సరఫరా చేస్తున్నారని జిల్లా ఆహార సలహా సంఘ సభ్యుడు ముద్దాడ మధు ఆరోపించారు. బుధవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో మెనూ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలలకూ చిన్న గుడ్లే రావడాన్ని గమనించారు. వెంటనే ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు చెప్పి గుడ్లను వెనక్కి పంపించారు. ఈ విషయమై ఆహార సలహా సంఘ సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

రైలు కిందపడి ఒకరి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు అతి సమీపంలో రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ ప్రకాశరావు తెలిపారు. మృతుడు ఆకుపచ్చ, నీలం రంగు గడులు గల ఫుల్‌హ్యాండ్ షర్టు.. నీలం, గులాబీ, తెలుపు రంగు లుంగీ ధరించాడన్నారు. మృతదేహం నుజ్జునుజ్జవడంతో గుర్తించలేకపోతున్నామని చెప్పారు. పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి మృతదేహం తరలించామని, దుస్తుల ప్రకారం ఎవరైనా గుర్తిస్తే 79897 27874 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


డీఎస్పీ గురుమూర్తి

బొండపల్లి: బొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన అట్రాసిటీ కేసుకు సంబంధించి డీఎస్పీ గురుమూర్తి బుధవారం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే... ఆగస్టు 21 రాత్రి 7 గంటల సమయంలో ఆటో డ్రైవర్ రేగేటి సంతోష్‌కుమార్ పలువురు కళాశాల విద్యార్థులను ఎం. కొత్తవలస మీదుగా జె.గుమడాం తీసుకెళ్తున్నాడు. ఇంతలో ద్విచక్ర వాహనంపై వెనుకనుంచి వస్తున్న ఎటూరు అప్పారావు, కొవ్వాడ అప్పలనాయుడు అతనిపై దాడి చేయడంతో పాటు కులంపేరుతో దూషించారు. మార్గమధ్యలో దారి ఇవ్వకపోవడం వల్లే వారు దాడి చేసినట్లు ఆటో డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా రోళ్లవాక లోని ప్రభుత్వ స్థలంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఇళ్లు నిర్మించుకుంటుంటే ఓ వ్యక్తి అడ్డుతగులుతున్నాడు. ఈ విషయమై కూడా డీఎస్పీ విచారణ చేపడుతున్నారు.

నిర్ణీత వ్యవధిలోగా అనుమతులు

- కలెక్టర్ వివేక్‌యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు వివేక్‌యాదవ్

విజయనగరం ఫూల్‌బాగ్: పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివేక్‌యాదవ్ మాట్లాడుతూ, 18 కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులను నెల రోజుల వ్యవధిలో మంజూరు చేయడం అభినందనీయమన్నారు. రూ.339 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమల ద్వారా 489 మందికి కొత్తగా ఉపాధి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని చెప్పారు. అలాగే వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న ఐదు దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరించాలని సూచించారు. సింగిల్ విండో విధానంలో పరిశ్రమలకు ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు 21 రోజుల్లో మంజూరు చేయాలన్నారు. ఒకవేళ అవసరమైన సమాచారం గాని డాక్యుమెంట్లు గాని లేకపోతే వెంటనే తిరస్కరించాలే తప్ప పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. రాజాపులోవ నుంచి విజయనగరం పట్టణం వరకు ఉన్న జాతీయరహదారిని అనుకుని ఉన్న లేఅవుట్లకు ఉడా ఆధ్వర్యంలో ఏ విధంగా అనుమతులు ఇచ్చారని ఉడా ప్రణాళిక విభాగం అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు వెంబడి అనుమతులు మంజూరు చేసిన లేఅవుట్లు, జిల్లాలో అనుమతుల్లేకుండా వెలసిన లేఅవుట్ల వివరాలను అందజేయాలని ఉడా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న ఆఖరు సంవత్సర విద్యార్థులకు జిల్లాలోని వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థల్లో ప్రాక్టికల్ శిక్షణ పొందే అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ ఉదయభాస్కర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు యతిరాజులు, ఆర్‌డీఓలు శ్రీనివాసమూర్తి, సుదర్శనదొర, డీపీఓ సత్యనారాయణ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుదర్శనం, తహసీల్దార్లు, పలు పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం

- సీసీఎల్‌ఏ అనిచంద్ర పునేఠా


వీసీలో పాల్గొన్న జేసీ, ఇతర అధికారులు

విజయనగరం గంటస్తంభం: అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం చేయాలని రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి ఆయన బుధవారం జిల్లా అధికారులు జేసీ శ్రీకేష్ బి. లఠ్కర్, డీఆర్వో ఆర్ఎస్ రాజ్‌కుమార్, ఆర్డీఓ శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఓ 135, 299లను అనుసరించి అనధికార ఆక్రమణలకు 2014 జనవరి ఒకటో తేదీని కటాఫ్ డేట్‌గా పరగణించి క్రమబద్ధీకరించాలని సూచించారు. పరాధీనంలో ఉన్న భూములకు సంబంధించి కేసులను త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులకు రుణ అర్హత పత్రాలు జారీ చేయాలన్నారు. లోడ్ చార్జ్‌డ్ క్రియేషన్ మాడ్యూల్ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జేసీ శ్రీకేష్ మాట్లాడుతూ, బీపీఎల్‌కు చెందిన 825 కుటుంబాల వారికి ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశామన్నారు. రుణ అర్హత పత్రాలకు 8,125 దరఖాస్తులు రాగా 7,991 మందికి పత్రాలు జారీ చేశామని తెలిపారు. వారిలో 755 మంది రుణాలు పొందారని చెప్పారు. ‘విద్యార్థుల సేవలో రెవెన్యూశాఖ’కు వచ్చిన 87,595 దరఖాస్తులు రాగా శతశాతం పరిష్కరించామన్నారు. సమావేశంలో జిల్లాలో సర్వేశాఖ ఎ.డి గోపాలరావు, ఏఓ రమణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు


ఆస్పత్రిలో తుషిత


గాయపడిన ఫరాన్

పార్వతీపురం టౌన్: పట్టణంలోని నాలుగో వార్డు పరిధి తూర్పువీధి (కూను బిల్లివారి వీధి)కి చెందిన యడ్ల తుషిత అనే నాలుగేళ్ల బాలికపై బుధవారం ఉదయం కుక్క దాడిచేసింది. ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో అటుగా వచ్చిన కుక్క ఒక్కసారిగా తుషితపై దాడి చేయడంతో కుడి చేయిపై తీవ్రగాయమైంది. వెంటనే చిన్నారిని పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మరో ఇద్దరికి.

పట్టణంలోని వివేకానంద కాలనీ గణేష్ రామ్‌వీధిలో ఉంటున్న మంజుదేవి ఇంటి బయట కూర్చుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. అలాగే తూర్పువీధికి చెందిన ఫరాన్ అనే బాలుడు ఆడుకుంటుండగా కుక్క కరిచింది. దీంతో వెంటనే బాధితులను కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మిలీనియం మార్చ్‌ను విజయవంతం చేయండి..

- బీసీ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు



మాట్లాడుతున్న జిల్లా బీసీ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బీకేవీ ప్రసాదరావు

విజయనగరం మున్సిపాలిటీ: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల ఉద్యోగులు సెప్టెంబర్ 1న విజయవాడలో చేపట్టనున్న మిలీనియంమార్చ్‌ను విజయవంతం చేయాలని బీసీ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బీకేవీ ప్రసాదరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో సంఘ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ, 2004 తర్వాత ప్రవేశపెట్టిన సీపీఎస్ విధానం వల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఆర్థిక భద్రత ఉండడం లేదన్నారు. వెంటనే సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం తన తీరు మార్చుకోకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కోట్ల మూర్తి, పి.సురేష్, వి.రామరాజు, ఎ.రవికుమార్, పి.సంతోష్‌కుమార్, ఎస్.గనేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అపర సరస్వతి.. ఆదిభట్ల

● నేడు 153వ జయంతోత్సవం

● సంగీత కళాశాలలో కాంస్య విగ్రహం ఏర్పాటు



ఆదిభట్ల నారాయణదాసు

నాలుగేళ్ల వయసులోనే భాగవత పద్యాలను ఆలపించాడు. అయిదేళ్లకే కావ్య సంబంధిత పాఠాలను వల్లె వేశాడు. పదేళ్ల ప్రాయంలోనే తాళ పత్ర గ్రంథాలు రాశాడు. పద్నాలుగేళ్ల వయసులో ఆంగ్లంలో అంతు లేని జ్ఞానాన్ని సముపార్జించాడు. పంతొమ్మిదో ఏట హరికథాగానాన్ని సుమధుర గళంతో ఆవిష్కరించాడు. విజయనగరం జిల్లాకు విశ్వఖ్యాతినార్జించి పెట్టాడు. ఆయనే హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు.

– విజయనగరం టౌన్

ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగస్టు 31న అప్పటి బొబ్బిలి తాలూకా అజ్జాడ గ్రామంలో జన్మించారు. తల్లి నరసమ్మ, తండ్రి చయనులు. ఆ దంపతులకు దాసు ఎనిమిదో సంతానం. పదేళ్లకే ఘంటం పట్టుకుని తాళపత్ర గ్రంథాలను రాయగలిగే నేర్పును సంపాదించారు. ఆయన పూర్తిపేరు సూర్యనారాయణదాసు. ముద్దుపేరు సూరన్న. నారాయణదాసుకు తొలి గురువు బొబ్బిలి సంస్థానంలో వీణ విద్వాంసుడైన వాసా సాంబయ్య. ఆంగ్లంపై పట్టు సంపాదించేందుకు విజయనగరం వచ్చిన దాసుకు ప్రముఖులు మహబత్‌ఖాన్, పప్పు వెంకన్న, వీణా వెంకటరమణదాసు, కలిగొట్ల కామరాజు తదితరుల దీవెనలు మెండుగా లభించాయి.

పంతొమ్మిదో ఏటే హరికథాగానం

ఓసారి మద్రాసు నుంచి కుప్పుస్వామి నాయుడు అనే ప్రముఖుడు విజయనగరం వచ్చి కానుకుర్తి హనుమంతరావు ఇంటి వద్ద హరికథ చెప్పారు. అది చూసిన నారాయణదాసు ఎంతో స్ఫూర్తి పొందారు. 19 ఏళ్ల ప్రాయంలో నాయుడు వద్ద హరికథాగానంలో మెలకువలు నేర్చుకున్నారు. ధవచరిత్ర యక్షగాన ప్రబంధాన్ని స్వయంగా రాసి అన్న సీతారామయ్య ఆశీర్వాదంతో వేణుగోపాలస్వామి మఠంలో తొలిసారిగా హరికథా గానం చేశారు. 1883లో వడ్లమాని సుబ్బారావు సోదరుని కుమార్తెను వివాహమాడారు. విజయనగరం మహారాజా సంగీత కళాశాలకు కొంత కాలం ప్రధాన అధ్యక్షునిగా పనిచేశారు. ఆయన సంస్కృతం, ఆంగ్లం, తెలుగు , హిందీ, పారశీకం, అరబ్బీ, ఉర్దూ, తదితర భాషల్లో దిట్ట. ఉమర్ ఖయ్యాం రాసిన రుబాయిలను కూడా మధురంగా ఆలపించేవారు. దాసు పెనుమత్స జగన్నాథరాజు ప్రోత్సాహంతో పిఠాపురంలో రాజా ముందు హరికథ చెప్పి అనేక బహుమతులు పొందారు.

అష్టావధానంలోనూ అద్భుత ప్రతిభాశాలి

1886లో విశాఖలో ప్రముఖ న్యాయవాది వేపా రామేశం ఆహ్వానం మేరకు అష్టావధానం చేశారు. దాసుకు అంబరీషోపాఖ్యానం, జానకీ శపథం, యధార్థ రామాయణం, గజేంద్రమోక్షం, ప్రహ్లాద చరిత్ర, సావిత్రి చరిత్ర, భీష్మ చరిత్ర, మార్కండేయ చరిత్ర, శ్రీకృష్ణ జననం, సీతాకల్యాణం తదితర హరికథలు గొప్ప పేరు తెచ్చిపెట్టాయి. ఆయన రుక్మిణీ కల్యాణం, కాశీ శతకం, సారంగధర, తారకం, ధర్మసంస్థాపనం, మత్యుంజయ శతకం తదితర 46 రచనలు చేశారు. ఆయనకు 1933లో జయపూర్ మహారాజా విక్రమదేవ వర్మ 'సంగీత సాహిత్య సార్వభౌమ' అనే బిరుదు ఇచ్చారు. ఆదిభట్ల 1945 జనవరి 2వ తేదీన కన్నుమూశారు.

ఆనందకరం



కళాశాల తొలి ప్రిన్సిపల్‌గా పనిచేసిన హరికతా పితామహుడు ఆదిభట్ల విగ్రహ ప్రతిష్టాపన ఆనందకరం. ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. కళాశాల నుంచి ఎందరో మహానుభావులు దేశ విదేశాల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. – *బురిడి అనూరాధా పరశురామ్, ప్రిన్సిపల్, మహారాజా సంగీత, నృత్య కళాశాల*



మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల

కాంస్య విగ్రహావిష్కరణ నేడు

ఆదిభట్ల 153వ జయంతి వేడుకలను మహారాజా సంగీత, నృత్య కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆదిభట్ల నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 8 గంటలకు నారాయణదాసు చిత్రపటంతో ఊరేగింపు, విగ్రహ రూపశిల్పి సి.రవిశంకర్ పట్నాయక్‌కు సత్కారం, అనంతరం హరికథా చూడామణి బిరుదు పొందిన జయంతి సావిత్రి భాగవతార్, కోట సచ్చిదానందశాస్త్రి, కాళ్ల నిర్మల, సినీ నటి పడాల కల్యాణి, ధూళిపాల శివరామకృష్ణ భాగవతార్, సింహాచల భాగవతార్‌లతో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 వరకూ హరికథాగానం చేస్తారు.

చాలా ఆనందంగా ఉంది



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అభినందనీయం. ఏటా ప్రతిచోటా ఆదిభట్ల జయంతి ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనందదాయకం. ఆదిభట్ల నిలువెత్తు కాంస్య విగ్రహ ప్రతిష్ట ఒక ప్రత్యేక అంశం. ఆదిభట్ల అభిమానులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలి. – *పడాల కల్యాణి, సినీనటి, వ్యవస్థాపకురాలు, శ్రీ ఆదిభట్ల శ్రీకళాపీఠం*

అన్నమయ్య కీర్తనలు అమృత గుళికలు. ఒకటా రెండా.. 32 వేల కీర్తనలు. ఒకదానికొకటి తీసిపోనివి. అన్నీ అద్భుతాలే. వాటిలో ఆణిముత్యాల్లాంటి కీర్తనలను ఎంపిక చేయడం కత్తిమీద సామే. కానీ పార్వతీపురానికి చెందిన వాసవి, గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆ పని చేశారు. అన్నమాచార్యుడు రచించిన 32 వేల కీర్తనల్లో 505 కీర్తనలను ఎంపిక చేసి పుస్తకంగా ప్రచురించారు. వాటిని ఉచిత పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు.



అన్నమాచార్య కీర్తనలను ఆవి

తల్లిదండ్రుల జ్ఞాపకార్థ

వాసవి, గాయత్రి విద్యాసంస్థల వ్యవ
తల్లిదండ్రులైన పేర్ల వెంకట రమణ మూర్తి
రా దేవి జ్ఞాపకార్థం ప్రచురించిన అన్నమ
సంకీర్తనల పుస్తకాలను బుధవారం వే
కళామందిర్‌లో శ్రీవిద్య సర్వమంగళా దేవి
స్థాపకుడు మురపాక కాళిదాసు శర్మ ఆవిష్క
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
చార్యుడు సాక్షాత్తు ఆ పరబ్రహ్మ స్వరూపానే





బాలాజీ కూడలి రోడ్డులో గోతిని దాటుతున్న పాదచారి

505 కీర్తనలతో పుస్తకం ప్రచురణ ● ఉచిత పంపిణీకి ఏర్పాట్లు

అమ్మానాన్నల జ్ఞాపకం అన్నమయ్య సంకీర్తనం



...ష్కరిస్తున్న కాళిదాసు శర్మ తదితరులు



అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని పుస్తకం

...స్థాపకులు, ..., వసుంధ ...మాచార్యుని ...ంకటేశ్వరా ...పీఠం వ్యవ ...రించారు. ... అన్నమా ...ర్నే తన కీర్త నలతో దాసోహం చేసుకున్న మహోన్నతుడని కొనియాడారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కీర్తనలను పట్టణానికి చెందిన నేరెళ్ల లలిత, సుబ్బలక్ష్మి ఆలపించారు. అనంతరం సభికులకు ఉచితంగా అన్నమాచార్య సంకీర్తనల పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎంపీపీ హరిప్రియా థాట్రాజ్, ప్రముఖ వేదగణిత పండితుడు నేరెళ్ల నారాయణమూర్తి పాల్గొన్నారు. – పార్వతీపురం టౌన్


రామతీర్థంలో పచ్చని వరి పైరు

భూమికి పచ్చని రంగేసినట్టు..

కొండలను కమ్మేసిన మేఘాలు. పచ్చని పంట పొలాలు. కనువిందు చేసే చెట్టూ చేమా.. చూసే కళ్లకు నేత్రానందం. మనసుకు పరవశం. ప్రకృతి గీసిన అద్భుత చిత్రం. ఈ దృశ్యమాలిక నెల్లిమర్ల–రణస్థలం రహదారిలో దర్శనమిస్తుంది. పచ్చని చెట్లతో పెద్ద పెద్ద కొండలు.. వాటిని కమ్మేసిన మేఘంప్రకృతి ప్రేమికులను రారమ్మంటుంది. కొత్తపేట, రామతీర్థం, సతివాడ గ్రామాల్లోని కొండలు పచ్చదనంతో పరవశింపజేస్తున్నాయి. ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రకృతి అందాల్ని చూసి మురిసిపోతున్నారు. సెల్ కెమెరాల్లో బంధిస్తున్నారు. – నెల్లిమర్ల రూరల్


కొత్తపేట వద్ద కొండలపై మేఘమాల


కొత్తపేట రోడ్డులో పూర్తికాని భవనాల తొలగింపు

పండగొస్తున్నా పట్టదా..

పైడితల్లి సిరిమానోత్సవానికి విజయనగరం సిద్ధమవుతోంది. జాతర తేదీలు ఖరారవడంతో అమ్మవారి దర్శనానికి అఖండ భక్తకోటి ఉవ్విళ్లూరుతోంది. లక్షల సంఖ్యలో హాజరయ్యే రద్దీని తట్టుకునేందుకు తలపెట్టిన రహదారుల విస్తరణ ప్రక్రియ మాత్రం చతికిలపడింది. ఇష్టమొచ్చినట్టు తవ్విపారేసిన గోతులు.. నిర్మాణ సామగ్రితో పాదచారులకు నరకయాతన మిగులుతోంది.

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


స్టేట్‌బ్యాంక్ పక్కన తవ్వి వదిలేసిన రోడ్డు


కోట ప్రాంతంలో గోతిని దాటుతున్న వృద్ధుడు


సంగీత కళాశాల వద్ద విద్యార్థుల అవస్థలు


బాలాజీ కూడలి రోడ్డులో పూర్తి కాని కాలువ పనులు


సంగీత కళాశాల మార్గంలో తవ్విన రోడ్డు


రోడ్డు విస్తరణకు తీసుకొచ్చిన రాళ్ల కుప్పలు

మలేషియన్ నాట్యమయూరీ అవార్డుకు శ్రీదేవీకృష్ణ


శ్రీదేవీకృష్ణ

విజయనగరం టౌన్: మలేషియా తెలుగు ఫౌండేషన్, పిరమిడ్ యోగా అండ్ డ్యాన్స్ అకాడమీ ఇంటర్నేషనల్ సంయుక్తంగా సెప్టెంబరు 2న మలేషియాలో నిర్వహిస్తున్న నృత్యోత్సవాల్లో భాగంగా జిల్లాకు చెందిన శ్రీదేవీకృష్ణను మలేషియన్ నాట్యమయూరీ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా అక్కడ నిర్వహించబోయే నృత్యోత్సవాల్లో ఆమెతో పాటూ ఆమె శిష్యురాలు కె. ఆదర్శ్ సాయి కీర్తన భరతనాట్యం, కూచిపూడి నృత్యప్రదర్శన ఇవ్వనున్నారని తెలిపారు. విదేశాల్లో ప్రదర్శన ఇవ్వాలన్న కోరిక నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని, అంతేకాకుండా తొలి విదేశీ ప్రదర్శనలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఆగస్టు 31 శిష్యురాలితో కలిసి మలేషియా వెళ్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ రెండు అంతర్జాతీయ అవార్డులు విశాఖలో అందుకోగా, మూడోది మలేషియాలో అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

క్రమబద్ధీకరించకుంటే సమ్మె తప్పదు

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవఅధ్యక్షుడు అప్పలసూరి

విజయనగరం మున్సిపాలిటీ: ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ పరిధిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించకుంటే వచ్చే నెల 30 నుంచి సమ్మెలోకి దిగుతామని, ఈ మేరకు 1న సర్కిల్ ఎస్ఈకి సమ్మె నోటీసు ఇవ్వనున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జి.అప్పలసూరి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో అన్ని సంఘాల రాష్ట్ర నాయకత్వాలు హాజరై సమ్మె పిలుపుకు మద్దతునిచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 16న ట్రాన్స్‌కో, జెన్‌కో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్లకు నోటీసులు అందజేశామన్నారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం తరహా ఇక్కడి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె నోటీసు అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న సబ్ ఇంజినీర్లు, సిప్టుఆపరేటర్లు, మీటర్ రీడర్లు, సెక్షన్ ఆఫీసు /సబ్‌డివిజన్/సర్కిల్ కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, వాచ్‌మెన్లు పాల్గొని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు.

టీచర్ల సరెండర్ లీవ్ విధానంలో సడలింపులు

- ఖజానాశాఖ డిప్యూటీ డైరక్టర్ ధర్మారావు


డిప్యూటీ డైరక్టర్ ధర్మారావు

విజయనగరం కంటోన్మెంట్: ఉపాధ్యాయుల ఆర్థిక సెలవు రోజుల సరెండర్ చేయడంలో సడలింపు ఉత్తర్వులు విడుదలయ్యాయని ఖజానా శాఖ డిప్యూటీ డైరక్టర్ ఏ ధర్మారావు తెలిపారు. దీనికి సంబంధించి ఎయిడెడ్, పంచాయతీరాజ్, మున్సిపల్ టీచర్లు రిటైరైన నాటికి ఆర్థిక సెలవు రోజులు 300 ఉండాలన్నారు. ఈ సంఖ్యకు తక్కువగా ఉన్న ప్రాప్తి రోజులకు ఆఫ్‌పే లీవు నుంచి నగదుగా మార్చుకోవచ్చని తెలిపారు. అలాగే ఖజానా, చెల్లింపులు, ఎల్ఎఫ్ భవన సముదాయానికి కలెక్టరేట్ వెనుక ఉన్న ఎస్ కోట రోడ్డు పక్కన స్థలాన్ని కేటాయించారని డీడీ తెలిపారు. త్వరలో దీనికి సంబంధించి ఆమోదం తెలుపనున్నారన్నారు. కురుపాం, పార్వతీపురం, బొబ్బిలి సబ్‌ట్రెజరీ కార్యాలయాల భవనాలు మంజూరయ్యాయనీ, ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయన్నారు.

ఉద్యోగులు విధిగా ఐడెంటిటీ కార్డులు ధరించాలి

ప్రభుత్వ ఉద్యోగులు విధిగా గుర్తింపు కార్డులను ధరించాలని ఖజానా శాఖ డీడీ ఏ ధర్మారావు అన్నారు. దీనికి సంబంధించి ఖజానా ఉద్యోగులకు ఆదేశాలిచ్చామన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి ఐడెంటిటీ కార్డులు ధరించాలన్న నిబంధనలు జారీ చేశామన్నారు. దీని వల్ల కార్యాలయానికి వచ్చే సందర్శకులు, ఇతరులకు ఎవరు ఉద్యోగులన్న విషయం అవగతమవుతుందన్నారు.

ఇక్కడ కుదరదు..
కేజీహెచ్‌కెళ్లండి..

- హెచ్ఐవీ రోగులకు అందని వైద్యం
- చికిత్స కోసం కేజీహెచ్‌కు పంపిస్తున్న ప్రభుత్వ వైద్యులు
- తప్పక ప్రవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వ్యాధిగ్రస్థులు



హెచ్ఐవీ రోగులు చికిత్స పొందే ఏఆర్‌టీ కేంద్రం

చీపురుపల్లి మండలానికి చెందిన ఓ హెచ్ఐవీ రోగి హైడ్రోసిల్ సర్జరీకోసం రెండు రోజుల క్రితం కేంద్రాస్పత్రికి వచ్చాడు. అతన్ని పరీక్షించిన వైద్యుడు రిఫర్‌టు కేజీహెచ్ అని రాసి పంపించేశారు.

బొండపల్లి మండలానికి చెందిన ఓ హెచ్ఐవీ రోగి కొద్ది రోజుల క్రితం ఎముకల సంబంధిత వ్యాధితో శస్త్రచికిత్స కోసం వస్తే అతనికి కూడ శస్త్రచికిత్స చేయకుండా కేజీహెచ్‌కు రిఫర్ చేసేశారు. ఇది ఇద్దరి పరిస్థితే కాదు. అనేక మంది హెచ్ఐవీ బాధితులు ఎదుర్కొంటున్న పరిస్థితి.

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ బాధితులకు వైద్యం అందని ద్రాక్షగా తయారైంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందించడానికి వైద్యులు ఇష్టపడడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకూడదు. వారి పట్ల ప్రేమ, దయతో మెలగాలని పాలకులు, వైద్యాధికారులు నిత్యం సందేశాలిస్తుంటారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ప్రేమ, దయ దేవుడు ఎరుగు వారికి వైద్యం అందించడానికి కూడా చాలా మంది వైద్యులు ఇష్టపడడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను(శస్త్రచికిత్సలు అవసరమైన వారిని) ఎక్కువగా కేజీహెచ్‌కు రిఫర్ చేసేస్తున్నారు. కేజీహెచ్‌కు వెళ్లడం వ్యయప్రయాసాలతో కూడుకున్నప్పటికి గత్యంతరం లేక వెళుతున్నారు.

ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ ఉండాలి

హెచ్ఐవీ రోగుల కోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ ఉండాలి. కానీ కేంద్రాస్పత్రిలో ఈ సౌకర్యం లేదు. అటువంటి ఏర్పాట్లు కూడా చేయడం లేదు. హెచ్ఐవీ ఉందని తెలియగానే రోగులను రిఫర్ చేయడానికి వైద్యులు ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రవేటు ఆస్పత్రుల్లో వేలల్లో ఖర్చు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు చేయకపోవడంతో కొంతమంది ప్రవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వారు అందినకాడికి దోచుకుంటున్నారు. శస్త్రచికిత్సకు రూ.50 వేలు నుంచి రూ.70 వేలు వరకు వసూలు చేస్తున్నారు. అంత మొత్తంలో ఇచ్చుకోలేని పేద రోగులు కేజీహెచ్‌కు వెళుతున్నారు. అంత దూరం వెళ్లలేని వారు శస్త్రచికిత్సలు చేసుకోకుండా ఇళ్ల వద్దే ఇబ్బంది పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం...

హెచ్ఐవీ రోగులకు తప్పనిసరిగా శస్త్రచికిత్సలు చేయాల్సిందే. వారికి ప్రేమతో, మరింత శ్రద్ధతో వైద్యం అందించాల్సిన అవసరం ఉంది. అలా చేయని వైద్యులపై చర్యలు తీసుకుంటాం.

కె. సీతారామరాజు,
సూపరింటెండెంట్, కేంద్రాస్పత్రి

అంధుల పాఠశాలకు రూ.లక్ష వితరణ

గరివిడి: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లోగల ఉమెన్ అండ్ చైల్డ్ స్కూల్ (అంధుల పాఠశాల) విద్యార్థులకు లయన్స్ క్లబ్ రీజనల్ మేనేజర్ వి.సూర్యనారాయణ లక్ష రూపాయల చెక్కును అందించారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులు 13 మంది వారి ప్రతి పుట్టిన రోజున అంధపిల్లలకు భోజనం పెట్టాలనే సదుద్దేశంతో ఏడాదికి 13 రోజుల చొప్పున వారికి మూడు సంవత్సరాలకు అయ్యే ఖర్చును ఒకేసారి రూ.లక్ష రూపాయల చెక్‌గా జిల్లా లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్, స్థానిక లయన్స్ క్లబ్ ఛైర్మన్ తాడి కమలాకర్ రావు, ఫేకర్ సీఈఓ ఎమ్.ఎస్.ఎన్.శర్మ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎం.వి.ఎన్.రాజు, టి.వి.రామారావు, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చెక్కను అందుకుంటున్న ఫేకర్ సీఈఓ ఎంవీఎన్ శర్మ

శారదా కంపెనీలో అప్రంటీస్‌కు ఇంటర్వ్యూలు

కొత్తవలసరూరల్: విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళానికి చెందిన వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న ఈఈఈ, మెకానికల్ బీటెక్ విద్యార్థులు కంటకాపల్లి శారదా అల్లాయిస్ కంపెనీలో ఒక సంవత్సర కాలంపాటూ అప్రంటీస్ చేసేందుకు బుధవారం నరపాం కోస్టల్ ఇంజినీరింగ్ కళాశాలలో శారదా కంపెనీ ప్రతినిధులు ఎన్ సూర్యనారాయణమూర్తి సీనియర్ మేనేజరు, శంకరరావు, వెంకటరావు మేనేజర్ మెకానికల్, దీపక్ కుమార్ ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రూమెంట్స్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఈ ఇంటర్వ్యూలకు మూడు జిల్లాలకు చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొన్నారని రాత పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు రెండురోజుల్లో ఫలితాలు ప్రకటిస్తారని కళాశాల ప్లేస్‌మెంటు అధికారి అడపా శ్రీనివాసరావు తెలిపారు. ట్రైనీ కాలంలో ఒక్కొక్కరికి నెలకు 5 వేలు రూపాయలు స్టైఫండ్‌గా ఇస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్‌కే నరసింహారాజు తెలిపారు. కార్యక్రమంలో సీతం అధ్యాపకులు గీత నాయుడు పాల్గొన్నారు.


కోస్టల్‌లో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న శారదా కంపెనీ ప్రతినిధులు

1న సామ్రాజ్యవాద వ్యతిరేక ర్యాలీ

విజయనగరం పూల్‌బాగ్: సెప్టెంబరు 1న దేశవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా జిల్లాలోనూ ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు సీపీఎం విజయనగరం డివిజన్ కార్యదర్శి రెడ్డి శంకరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదం నేడు ప్రపంచాన్ని పీక్కుతింటోందని, భారతదేశంలో అధికారంలో ఉన్న మోదీ అమెరికా మోకాళ్లవద్ద మోకరిల్లుతున్నారని అన్నారు. విదేశాలకు చెందిన వాల్‌మార్ట్, అమెజాన్, ఫ్లిప్‌కార్టు వంటి సంస్థలు భారత్‌లో వ్యాపారం చేసుకుని లక్షలు కోట్లు దోచుకుంటున్నాయని, దేశానికి మూలస్తంభాలైన రైల్వే, టెలికాం, పోస్టల్, ఎయిర్ ఇండియా లాంటి సంస్థలు, బ్యాంకింగ్ రంగాన్ని పూర్తిగా విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు అప్పజెప్పి దేశాన్ని అమెరికా తాకట్టుపెడుతున్న నేపథ్యంలో దేశరక్షణ కోసం సెప్టెంబరు 1 దేశవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేకంగా పోరాడుతోందన్నారు.

ఆంధ్రలో పెరిగిన నీటి మట్టం

మెంటాడ: మండలంలోని ఆంధ్ర జలాశయంలో గత వారం రోజుల క్రితం వరకు అనుకున్న స్థాయిలో నీరు కన్పించలేదు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయంలో జలకళ కనిపిస్తోంది. ఈ వర్షాలు అనంతగిరి కొండల్లో కురవడంతో జలాశయంలోనికి నీరు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఆంధ్ర జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 146 మీటర్లు. ప్రస్తుతం 141.06 మీటర్లకు నీరు చేరుకుంది.

ముందుకు సాగని భూ సేకరణ

- నిధులు లేవు.. సిబ్బంది లేరు
- ప్రభుత్వ నిర్వాకంతో అవస్థలు పడుతున్న అధికారులు



విజయనగరం ఆర్డీవో కార్యాలయంలో భూసేకరణ యూనిట్

విజయనగరం గంటస్తంభం:

ప్రభుత్వ, ప్రయివేటు అవసరాలకు కావాల్సిన భూసేకరణ అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రత్యేక భూసేకరణ విభాగాలకు తప్ప మిగతా వాటికి ప్రభుత్వం నిధులు విదల్చకపోవడం, సిబ్బందిని నియమించకపోవడమే దీనికి కారణం. కార్యాలయాల్లో కాగితాల ఖర్చులకు సైతం కటకటలాడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదేం ఉద్యోగమంటూ అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

సమస్యగా మారిన భూసేకరణ

ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు, సంస్థ, పరిశ్రమ ఇలా ఏది ఏర్పాటు చేయాలన్నా భూమి అవసరం తప్పనిసరి. అలాగే, ప్రయివేటు వ్యక్తులు ఇందుకు చొరవ చూపినా వారికి స్థలమిచ్చే బాధ్యత ఇటీవల కాలంలో ప్రభుత్వమే తీసుకుంటుంది. అయితే, ప్రభుత్వ స్థలం ఉంటే నేరుగా ఆ స్థలం బదలాయిస్తోంది. ఇది పెద్ద ప్రక్రియ కాకపోయినా ప్రభుత్వం ఇంతకుముందు పేదలకు పంపిణీ చేసిన డి.పట్టా భూములు, రైతుల జిరాయితీ భూములు సేకరించి ఇవ్వాల్సి ఉంటే మాత్రం ఇందుకు నోటిఫికేషన్ మొదలుకుని పరిహారం ఇవ్వడం, భూమి సంబంధిత వర్గాలకు అప్పగించే వరకు సుదీర్ఘ ప్రక్రియ ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో భూసేకరణ సమస్యగా మారింది. కొన్ని ప్రాజెక్టులకు భూసేకరణ చేసేటప్పుడు ప్రత్యేక భూసేకరణ విభాగాలు ఏర్పాటు చేస్తున్నారు. సాధారణంగా జరిగే వాటి విషయంలో ఇలా ఏర్పాటు చేయకుండా రెగ్యులర్ రెవెన్యూ అధికారులపైనే ఆ భారం నెడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పరిస్థితి ఇందుకు కొంతవరకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం తోటపల్లికి సంబంధించి మాత్రమే మూడు భూసేకరణ యూనిట్లు ఉన్నాయి. బొబ్బిలిలో సాధారణ యూనిట్ ఉంది. వీరిలో కొందరికి తారకరామ భూసేకరణ బాధ్యత అప్పగించారు. ఇదిలాఉంటే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రాయానికి సంబంధించి మూడు యూనిట్లు స్థానికంగా ఏర్పాటు చేశారు. వీటికి మాత్రమే ప్రాజెక్టుల వ్యయం నుంచి ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తున్నారు. దీంతో అక్కడ అధికారులు, సిబ్బందికి వేతనాలు, నిర్వహణ ఖర్చులకు ఇబ్బంది లేదు. జిల్లాలో రాజాపులోవ నుంచి ఐనాడ వరకు ఆరు రోడ్లు విస్తరణ, విజయనగరం, సాలూరు బైపాస్ రోడ్లు, కొత్తవలసలో గిరిజన యూనివర్సిటీ, పతంజలి పరిశ్రమకు భూసేకరణకు సంబంధించి ఎటువంటి యూనిట్లు ఏర్పాటు చేయలేదు. ఇతర చిన్న, పెద్ద పరిశ్రమలకు సంబంధించి కూడా భూసేకరణ జరుగుతోంది. విద్యాసంస్థలు ఏర్పాటుకు సంబంధించి భూమి సేకరిస్తున్నారు. వీటికి సంబంధించి జిల్లాలో ప్రత్యేక యూనిట్లు లేవు. దీంతో ఈ బాధ్యతను ఆర్డీవోలకు అప్పగిస్తున్నారు.

భూసేకరణ ఎలా?

భూసేకరణ బాధ్యత అప్పగించినా.. దానికోసం నిధులు, సిబ్బందిని నియమించలేదని అధికారులే చెబుతున్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో ప్రస్తుతం ఎక్కడా భూ సేకరణకు సంబంధించి తహసీల్దారు, డీటీ, కంప్యూటరు అపరేటర్లు, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా లేరు. దీంతో రెగ్యులర్ పనులు చేసే వారిని పురమాయించాల్సి వస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న బైపాస్ రోడ్డు భూసేకరణకు సిబ్బంది లేకపోవడంతో ఆర్డీవో శ్రీనివాసమూర్తి మెరకముడిదాం, గంట్యాడ డీటీలను తీసుకొచ్చి పని చేయించడంతో అక్కడ పనులు పెండింగ్‌లో పడ్డాయి. సిబ్బందిని ఏదో విధంగా చేస్తున్నా నిర్వహణ ఖర్చులు లేకపోవడం మరో సమస్యగా మారింది. ఇలాంటి భూసేకరణకు ప్రభుత్వం ఒక్క పైసా కూడా విదల్చకపోవడంతో ఆర్డీవోలు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి భూసేకరణ అనేసరికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చాలా పని ఉంటుంది. కాగితాలు ఖర్చే వేలాది రూపాయలు ఉంటుంది. ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.ఒక్కోసారి చేతి డబ్బులు పెట్టుకుంటున్నారు. ఇందుకు ఇష్టం లేనివారు ఇతర పనులపై వచ్చే వారికి కాగితాలు, అవీ, ఇవీ కావాలని అడుగుతున్నారు. దీనివల్ల అధికారులు చులకనవుతున్నారు. లాంటి పరిస్థితి ఉంటే ఉద్యోగం చేయడం కష్టమని రెవెన్యూ అధికారులు అందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూసేకరణ ఉన్నచోట నుంచి వెళ్లిపోడానికి కొందరు అధికారులు ప్రయత్నాలు చేసుకుంటుండడం గమనార్హం. ఈ విషయం విజయనగరం ఆర్డీవో శ్రీనివాసమూర్తి వద్ద ప్రస్తావించగా భూసేకరణ బాధ్యత అప్పగిస్తే చేయాల్సిన బాధ్యత తమదన్నారు. అయితే ప్రత్యేక నిధులు, సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్న మాట కొంత వాస్తవమన్నారు.

అవినీతి రహిత పాలనకు పట్టం

- ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా కమిటీ



మాట్లాడుతున్న ఆప్ జిల్లా కన్వీకర్ ప్రతాప్‌వర్మ

విజయనగరం అర్బన్: అవినీతి రహిత పాలన అందిస్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీకి ఢిల్లీ ప్రజలు పట్టం కట్టారని పార్టీ జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ మేరకు పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఢిల్లీ ఉప ఎన్నిక ఫలితాలను విశ్లేషించారు. ఢిల్లీలోని బావన నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ తరపున ఫోటీ చేసిన రాంచందర్‌కు 24 వేల ఓట్ల భారీ అధిక్యాన్ని అందించి కేజ్రీవాల్‌పై చెక్కుచెదరని విశ్వాసంను కనబరిచారని తెలిపారు. ఫిరాయింపుదారులకు బుద్ధిచెప్పారని, నంద్యాల ఉప ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం డబ్బును విచ్చలవిడిగా పంచుతూ, అధికార దుర్వినియోగంతో నెగ్గిందని ఆరోపించారు. పార్టీ జిల్లా కన్వీనర్ పూసపాటి ప్రతాప్‌వర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.దయానంద్, కో–కన్వీనర్ శీర స్వామినాయుడు, వివిధ ప్రాంతాల నుంచి హాజరయిన కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువు, క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



త్వైకాండోలో విజయం సాధించిన చాందినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణరావు

పార్వతీపురం టౌన్: స్థానిక చాలకిబెలగాంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలికలు చదువు, క్రీడల్లో రాణిస్తున్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సీహెచ్ చాందిని విజయనగంలో సోమవారం జరిగిన స్కూల్‌గేమ్స్ అండర్ –17 విభాగంలో త్వైకాండో పాటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. సెప్టెంబర్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి త్వైకాండో పోటీలకు అర్హత సాధించింది. మరో బాలిక వై.మణికుమారి హైదరాబాద్‌లోని మన టీవీ చానల్‌లో ఇంగ్లిష్ పాఠ్యాంశాన్ని బోధించింది. ఇక్కడి బాలికలు ఇంగ్లిష్‌పై పూర్తిస్థాయిలో పట్టుసాధించడం గమనార్హం. బుధవారం ప్రచురితమైన మనటీవీ ప్రొగ్రాంలో ఆంగ్లంలో మణికుమారి బోధించగా, గణితంను స్వాతి అనే బాలిక గురువారం బోధించనుందని ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు.

పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయన్ని లెక్కిస్తున్న దేవాదాయ శాఖ సిబ్బంది

విజయనగరం టౌన్:

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి హుండీల లెక్కింపు బుధవారం స్థానిక పైడితల్లి అమ్మవారి కల్యాణ మండపం ఆవరణలో నిర్వహించారు. పైడితల్లి చదురుగుడి ఆలయం హుండీల నుంచి రూ.17,62,320, బంగారం 30 గ్రాములు, వెండి 290 గ్రాములు, వనంగుడి హుండీల నుంచి రూ.3,42,870లు, బంగారం 1.5 గ్రాములు, వెండి 135 గ్రాములు లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పీవీఎవీఎస్ భానురాజా తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో లొసుగులు సరిచేసేందుకే...

విజయనగరం పూల్‌బాగ్: ప్రజాస్వామ్యంలోని లొసుగులను ప్రజల భాగస్వామ్యంతో సరిచేసేందుకే తన ఐఏఎస్ కెరీర్‌ని వదిలిపెట్టి 1997, ఆగస్టులో లోక్‌సత్తా ఉద్యమ సంస్థను జయప్రకాశ్‌నారాయణ్ ఏర్పాటు చేసి, ప్రజా ఉద్యమాలకు నాందిపలికారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. 20 ఏళ్ల లోక్‌సత్తా పార్టీ ఉద్యమ ప్రస్థానంపై బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లలో ప్రజాసమస్యలు, పాలనలో లొసుగులపై హేతుబద్ధమైన, సాక్ష్యాధారాలతో ప్రజల ముందు అనేక అంశాలు ఉంచారన్నారు. జాతీయస్థాయి పరిపాలనలో ఎవ్వరున్నా పాలనాపరమయిన సంస్కరణలు 100 కు పైగా తీసుకువచ్చి విజయం సాధించారన్నారు. సమాచారహక్కు చట్టం, గ్రామ న్యాయాలయాలు, మంత్రివర్గం కుదింపు, న్యాయవ్యవస్థలో ప్రమాణాలు (122వ ఎమైన్‌మెంట్), 2జీ స్పెక్టం లైసెన్సులు రద్దు, సహజవనరులు వేలం పాట విధానం, జాతీయ ఆరోగ్యవిఏషన్ తదితర అంశాలపై జాతీయస్థాయి ఉద్యమాలు తీసుకువచ్చారన్నారు. అనంతరం ఉద్యమ ప్రస్థానం విజయాలు పుస్తకాలు విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీనాయకులు అనంతలక్ష్మి, రాయి పద్మావతి, ఎ.దామోదరరావు, జి. సత్యనారాయణ, ఎ.నాగభూషణం, ప్రసాద్, పద్మాకర్, తవిటి నాయుడు, భాస్కర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకమే లక్ష్యం

- కలెక్టర్ వివేక్‌యాదవ్ వెల్లడి



ఎస్.కోట రూరల్: లచ్చందొరపాలెంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ వివేక్‌యాదవ్, చిత్రంలో అధికారులు, నేతలు

శృంగవరపుకోట రూరల్:

మొక్కల సంరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డవర పంచాయతీ శివారు లచ్చందొరపాలెం గిరిజన గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 727 కిలోమీటర్ల పరిధిలో రోడ్లకిరువైపులా మొక్కలను నాటి సంరక్షించటం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం 100 కిలోమీటర్ల పరిధిలో మొక్కలను నాటినట్టు వెల్లడించారు. 100 మొక్కల సంరక్షణకు రూ.3,200 చొప్పున ఉపాధిహామీ నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద జిల్లాకు 10,900 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు జరుపుకునేందుకు ఆర్థికస్థోమత లేని వారికి సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు నుంచి రూ.10 వేల ఆర్థికసాయం అందజేస్తామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 35 ఇసుక రీచ్‌లు కేటాయించామని, జిల్లాలో మరో 30 రీచ్‌లు గుర్తించేందుకు మైనింగ్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖలతో కూడిన అధికారుల బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. మరుగుదొడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు. బొడ్డవర జంక్షన్‌లో గిరిజన గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండేలా పీహెచ్‌సీ మంజూరు చేయాలని ఎంపీపీ రెడ్డి వెంకన్న, సర్పంచ్ టి.పద్మావతి, నేతలు టి.సాంబరాజు, ఐ.శ్రీనురాజు, సావిత్రమ్మ తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, హౌసింగ్ పీడీ ఎస్.వి.రమణమూర్తి, హౌసింగ్ ఈఈ పి.రఘురాం, డీఈఈ గౌరీశంకర్, ఎంపీడీవో జె.మన్మథరావు, ఏఈ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిషోర్, పంచాయతీరాజ్ జేఈ సీహెచ్‌వీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారాలు తగవు

- ట్రాఫిక్ డీఎస్పీ రాజేశ్వరరావు



వ్యాపారులను వెనక్కి పంపి రోడ్డు క్లియర్ చేయిస్తున్న డీఎస్పీ , తదితరులు

విజయనగరం టౌన్: గంటస్తంభం పరిసర ప్రాంతం నుంచి కన్యకప రమేశ్వరి అమ్మవారి కోవెల రోడ్డు వరకు రోడ్లపై వ్యాపారాలు చేయడం తగదని ట్రాఫిక్ డీఎస్పీ ఎల్. రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయా ప్రదేశాల్లో ఆయన పర్యటించి అమ్మకాలు చేపడుతున్నవారిని వెనక్కి పంపించారు. అలాగే మున్సిపల్ అధికారులు, సిబ్బంది సహకారంతో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, వ్యాపారస్తులు రోడ్డు చివరన ఉంటే ఎటువంటి ఇబ్బంది ఉండదని, కానీ రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేయడంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నార న్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవపై అవగాహన తప్పనిసరి

- ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా మేనేజర్ రమేష్‌బాబు

విజయనగరం ఫోర్ట్: ఎన్టీఆర్ వైద్య సేవపై ప్రతిఒక్కరూ అవగాహన కలి ఉండాలని ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా మేనేజర్ రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక సుజాత డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎన్టీఆర్ వైద్యసేవ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) కార్డు ఉన్న వారు ఉచితంగా ఏడాదికి రూ.2 లక్షల వరకు వైద్యసేవలు పొందవచ్చునన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్‌ఎస్ కార్డులు లేనివారు ఆరోగ్యరక్ష పథకం ద్వారా కూడా ఉచిత వైద్యం పొందవచ్చని చెప్పారు. జిల్లాలో 14 నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఏయూ క్యాంపస్ ప్రత్యేక అధికారి, ప్రొఫెసర్ యోహన్‌బాబు

విజయనగరం అర్బన్: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటాలని ఏయూ క్యాంపస్ ప్రత్యేక అధికారి, ప్రొఫెసర్ జి.యోహన్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక క్యాంపస్ ఆవరణలో నిర్వహించిన 'పచ్చదనం – పరిశుభ్రత' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముందుగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ, కళాశాల స్థాయి నుంచి విద్యార్థులకు విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ క్యాంప్ ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, డాక్టర్ శీర హేమలత, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ లక్ష్మయ్య, ప్రసాద్, గోటేటి హిమబిందు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను మోడల్ ట్రీపార్కుగా చేస్తాం

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం మున్సిపల్ పరిధిలో ఏవైనా ఖాళీ స్థలాలు తమకు అప్పగిస్తే మోడల్ ట్రీపార్కుగా తయారు చేస్తామని సోషల్‌ఫారెస్టు డీఎఫ్ఓ వేణుగోపాలరావు అన్నారు. బుధవారం స్థానిక కేఎల్‌పురంలో పావనీనగర్‌లో మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణని కలిసి ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీవారు ముందుకు వచ్చి తమకు ఖాళీస్థలంలో బోరు వేయించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఇవ్వాలని కోరారు. అలా అయినట్లయితే దానిని ఫారెస్టు విభాగం అభివృద్ధి చేస్తుందన్నారు. అక్కడ 3000 గజాలు ఖాళీ స్థలాన్ని మున్సిపల్ సర్వేయర్‌తో సర్వే చేయించి, హద్దులు వేయించి అటవీశాఖకు అప్పగిస్తామని ప్రసాదుల రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు, కౌన్సిలర్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులు అర్హులే

- జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ప్రభావతి

విజయనగరం మున్సిపాలిటీ:

జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2017–18 సంవత్సరానికి సంబంధించి నిర్వహిస్తున్న అండర్–14, 17 బాల, బాలికల క్రీడా ఎంపికల్లో నిర్ణీత వయస్సు కలిగి ఉండి కళాశాల విద్యనభ్యసిస్తున్నవారు అర్హులేనని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వి.ప్రభావతి తెలిపారు. డీఈఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 17 ఏళ్ల వయసున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ ఏడాది పోటీలకు అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు వారి పదో తరగతి ధ్రువీకరణపత్రంతో పాటు వయసు ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

కబడ్డీ, వాలీబాల్ జట్ల ఎంపికలు వాయిదా..

ఈ నెల 1న నిర్వహించాల్సిన స్కూల్ గేమ్స్ అండర్–17 కబడ్డీ, వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు వాయిదా పడినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.వి.ప్రభావతి తెలిపారు. ఆ రోజున ప్రభుత్వ ఉద్యోగులు మిలీనియం మార్చ్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో డీఈఓ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఎంపికలు నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈ మార్పును గమనించాలని కోరారు. జిల్లా జట్ల ఎంపిక పోటీల వేదికలు, సమయం ఖరారుపై పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు స్థాయి మీరి ఆరోపణలు చేయడం తగదని ప్రభావతితో పాటు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి డీటీ గాంధీలు పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల సౌలభ్యం మేరకు పార్వతీపురంలో ఆర్చరీ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించేందుకు అదే సమవేశంలో నిర్ణయాన్ని ప్రకటించిన విషయాన్ని గుర్తురెగలాని హితవు పలికారు.



మాట్లాడుతున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి, తదితరులు

'మిలీనియమ్ మార్చ్'కు ఎమ్మెల్సీ గాదె మద్దతు

విజయనగరం అర్బన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు డిమాండ్‌తో విజయవాడలో సెప్టెంబర్ ఒకటో తేదీన నిర్వహించనున్న 'మిలీనియమ్ మార్చ్' నిరసన ర్యాలీకి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మద్దతు పలికారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిరసనలో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.తవిటినాయుడు, గోపాల పట్నాయక్, సంఘ ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జ్ బంకపల్లి శివప్రసాద్, తదితరులు కూడా మద్దతు పలికారు.

– రాష్ట్రీయ ఉపాధ్యా పండిత పరిషత్ మద్దతు

ఏపీసీపీఎస్‌ఈఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వచ్చేనెల 1న విజయవాడలో నిర్వహించనున్న 'మిలీనియం మార్చ్' కార్యక్రమానికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా కమిటీ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బంకురు గోవిందనాయుడు, ఏలూరు శ్రీనివాసరావు తెలిపారు.

– ఏపీఎస్‌టీయూఎస్ మద్దతు

మిలీనియమ్ మార్చ్ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి లక్షా 70 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు అడ్డూరి పైడితల్లి దొర, నాయకులు ఎం.అమర్‌నాథ్, ఎ.తవిటిందొర, బంగారుదొర, సత్యనారాయణ, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్‌టీయూఎస్ జిల్లా కమిటీ సభ్యులు

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం మున్సిపాలిటీ: రాష్ట్ర స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ అండర్–14, 17 బాల, బాలికల క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.వి.ప్రభావతి ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ స్టేడియంలో అండర్–14 వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించగా.. డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో అండర్–14,17 షటిల్ బ్యాడ్మింటన్, కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో స్విమ్మింగ్ జట్ల ఎంపిక పోటీలు బుధవారం సాగాయి. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో పోటీలు జరిగే వేదికలు, తేదీలను త్వరలో ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పోటీలను వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు, రీజనల్ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మాజీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కొవ్వాడ చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు తదితరులు పర్యవేక్షించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వాలీబాల్ జట్లు

సబ్ జైల్‌ను సందర్శించిన సివిల్ జడ్జి

విజయనగరం లీగల్: పట్టణంలోని సబ్ జైల్‌ను సీనియర్ సివిల్ జడ్జి , జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎం.శ్రీహరి బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా విచారణ ఖైదీలతో కాసేపు ముచ్చటించి కష్ట, సుఖాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి సంస్థ తరపున న్యాయ సహాయం ఉచితంగా అందజేస్తామని చెప్పారు.

కార్యక్రమంలో సంస్థ సభ్యులు పొట్నూరు రవి, మురళి, సబ్ జైల్ సూపరింటెండెంట్ గణేష్,తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు అవకాశం

విజయనగరం గంటస్తంభం: పట్టణ, గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆర్డీఓ శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 100 గజాల లోపు స్థలంలో నిర్మాణాలకు ఉచితంగా క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. ఆపై నిర్మాణాలకు వివిధ శ్లాబ్‌ల కింద రుసుం వసూలు చేసి క్రమబద్ధీకరిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కవితల పోటీ విజేతలకు అభినందనలు

విజయనగరం టౌన్: పాలపిట్ట, విమల సాహితీ సమితి సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన కవితా పోటీల్లో జిల్లాకు చెందిన రత్నాల బాలకృష్ణ, పక్కి రవీంద్రనాథ్ విజేతలుగా నిలిచారని సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి పాయల మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలకృష్ణ రాసిన 'సేదు బీర', రవీంద్ర రాసిన 'ఊపిరాడని చోటునుంచి' కవితలకు బహుమతులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలను సాహితీస్రవంతి ప్రతినిధులు చీకటి దివాకర్, చంద్రిక, పీఎస్.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

వేడుకగా 'ఎల్లో బ్లూమ్'

విజయనగరం అర్బన్: పట్టణంలోని రింగ్ రోడ్ ప్రాంతంలోని నారాయణ పాఠశాలలో 'ఎల్లో బ్లూమ్' కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు రంగు ప్రాముఖ్యతను తెలియజెప్పే వస్తువుల తయారీలను ప్రదర్శించారు. అనంతరం ప్రిన్సిపల్ ప్రభావతిదేవి మాట్లాడుతూ, వివిధ వస్తువుల ప్రాధాన్యతను పాఠశాల స్థాయిలోనే గుర్తించుకునేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.గిరిజాప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
విజయనగరం | గురువారం |
ఆగస్టు | 31 | 2017

Portal Updates:
www.sakshieducation.com
→ Paramedical Diploma Courses at AP Paramedical Board
→ PG Diploma Courses (Distance) 2017-18 at Andhra University
→ 65 Technical Superintendent & Medical Attendant Posts at SSC

విద్య
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం

Sakshi Vidya Online Edition www.sakshieducation.com/Vidya.aspx
Send your Feedback to..sakshieducation@gmail.com

'మార్తాండ సూర్యాలయం' నిర్మాత ఎవరు?



ఎం. వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.



జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. 'కవిరాజ మార్గం'ను అమోఘవర్షుడు ఏ భాషలో రాశాడు?
1) బెంగాలీ 2) సంస్కృతం
3) కన్నడం 4) మరాఠీ

2. 'దిల్వారా జైనాలయం' ఎక్కడ ఉంది?
1) రాజస్థాన్ 2) గుజరాత్
3) బెంగాల్ 4) కర్ణాటక

3. కాలచూరుల (హైహయులు) రాజధాని?
1) కనోజ్ 2) త్రిపురి
3) మౌంట్ అబూ 4) ఢిల్లీ

4. గహద్వాల చంద్రదేవుడు విధించిన ప్రత్యేక పన్ను ఏది?
1) పురిటి సుంకం 2) గణాచారి సుంకం
3) పొయ్యి సుంకం
4) తురుష్క దండన సుంకం

5. కింది వాటిలో చాంద్‌బర్దాయ్ హిందీలో రాసిన గ్రంథం?
1) పృథ్వీరాజ్ రాశో 2) రాజస్థాన్ కథావళి
3) నైషధ చరిత్ర 4) శిశుపాల వధ

6. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయాన్ని ఎవరు నిర్మించారు?
1) సోలంకీలు 2) చౌహాన్‌లు
3) చందేలులు 4) గహద్వాలులు

7. కింది వాటిలో సరైన జత ఏది?
1) విక్రమశిల విశ్వవిద్యాలయం – ధర్మపాలుడు
2) సోమనాథ దేవాలయం – ప్రభాస్ పఠాన్
3) మిహిర భోజుడు – ప్రతీహార వంశం
4) పైవన్నీ సరైనవే

8. మిహిరభోజుని ఆస్థానాన్ని సందర్శించిన అరబ్బు యాత్రికుడు ఎవరు?
1) సులేమాన్ 2) అబ్దుల్ రజాక్
3) ఫిరదౌసి 4) లేన్‌పూల్

9. జతపరచండి.

రాజవంశం	రాజధాని
i) చౌహాన్‌లు	a) అన్హిల్‌వాడ్
ii) పరమారులు	b) ఖజురహో
iii) సోలంకీలు	c) గౌర్
iv) చందేలులు	d) ధారానగరం
v) సేన	e) అజ్మీర్

1) i-a, ii-b, iii-c, iv-d, v-e
2) i-e, ii-d, iii-a, iv-b, v-c
3) i-a, ii-d, iii-c, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

10. పృథ్వీరాజ్ చౌహాన్ వివాహమాడిన గహద్వాల జయచంద్రుడి కుమార్తె ఎవరు?
1) శీలమహాదేవి 2) సంయుక్త
3) మాచల్దేవి 4) పద్మిని

11. మొదటి తరైన్ యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?
1) క్రీ.శ. 1191 2) క్రీ.శ. 1192
3) క్రీ.శ. 1193 4) క్రీ.శ. 1194

12. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కల్నల్ టాడ్ – రాజస్థాన్ కథావళి
2) షానామా – ఫిరదౌసి
3) జగన్నాథాలయం – భువనేశ్వర్
4) హిందూ జాతీయ వీరుడు – పృథ్వీరాజ్ చౌహాన్

13. చందేవార్ యుద్ధ విజేత ఎవరు?
1) గజినీ మహమ్మద్
2) మహమ్మద్ ఘోరి
3) పృథ్వీరాజ్ చౌహాన్ 4) జయచంద్రుడు

14. 'ముంజేశ్వర' చెరువు ఎక్కడ నిర్మించారు?
1) ధారానగరం 2) ఢిల్లీ
3) అజ్మీర్ 4) జోధ్‌పూర్

15. తమ శీల సంరక్షణకు రాజపుత్ర స్త్రీలు ఆత్మహత్య చేసుకోవడాన్ని ఏమంటారు?
1) జనానా 2) జిజియా
3) జౌహార్ 4) సల్లేఖన

16. 'సమరాంగణ సూత్రధార' గ్రంథాన్ని పరమార భోజుడు ఏ అంశాలపై రాశాడు?
1) వాస్తు అంశాలు 2) రాజనీతి అంశాలు
3) యోగా అంశాలు
4) అలంకారశాస్త్ర అంశాలు

17. 'పంచరత్నాలు' అనే కవులను పోషించిన వారెవరు?
1) మొదటి భీమరాజు 2) లక్ష్మణసేనుడు
3) విజయసేనుడు 4) జయసింహుడు

18. కింది వాటిలో గాంగయ నరసింహదేవుడు నిర్మించిన నిర్మాణం ఏది?
1) సూర్యాలయం (మొంఢోరా)
2) సూర్యాలయం (అల్మోరా)
3) సూర్యాలయం (కోణార్క్)
4) కైలాసనాథాలయం (ఎల్లోరా)

19. టిబెట్‌లో అతిశదీపాంకరుడు ప్రచారం చేసిన బౌద్ధమత శాఖ ఏది?
1) మహాయానం 2) హీనయానం
3) తాంత్రికయానం 4) వజ్రయానం

20. 'జ్ఞానమే మోక్షానికి మార్గం' అని ప్రబోధించిందెవరు?
1) ఆదిశంకరాచార్యులు
2) రామానుజాచార్యులు
3) మధ్వాచార్యులు 4) వల్లభాచార్యులు

21. 'ప్రతీహారులు' అంటే..?
1) శిల్పులు 2) వ్యాపారులు
3) నావికులు 4) ద్వార పాలకులు

22. త్రైపాక్షిక పోరాటం రాష్ట్రకూట, పాల, ప్రతిహార రాజ్యాల మధ్య ఏ భూభాగం కోసం జరిగింది?
1) రాయచూర్ 2) కనోజ్
3) ఢిల్లీ 4) నవద్వీపం

23. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కందరీయ మహాదేవాలయం – ఖజురహో
2) గిరిజాదేవి శక్తి పీఠం – కటక్
3) ఉడిపి – కర్ణాటక
4) విఠలాలయం – హంపీ

24. 'రాజతరంగిణి' గ్రంథం ఎవరికి సంబంధించింది?
1) కశ్మీర్ రాజులు 2) సేన రాజులు
3) సోలంకీలు 4) పరమారులు

25. 'భారత చరిత్ర పితామహుడు' ఎవరు?
1) చాంద్‌బర్దాయ్ 2) జె.ఎన్. సర్కార్
3) కల్హణుడు
4) మామిడిపూడి వెంకటరంగయ్య

26. పృథ్వీరాజ్ చౌహాన్ (మూడో పృథ్వీరాజ్) రాణి సంయుక్తను ఏ విధమైన వివాహం చేసుకున్నాడు?
1) స్వయంవర వివాహం
2) రాక్షస వివాహం 3) బ్రహ్మ వివాహం
4) ప్రజాపత్య వివాహం

27. మహమ్మద్ బిన్ ఖాసిం సైన్యాలను ఎదుర్కొన్న దాహిర్ రాజు భార్య పేరు?
1) రాణీబాయి 2) పరిమళదేవి
3) సూరజ్‌దేవి 4) రాణి పద్మిని

28. అరబ్బులు హిందువులు, బౌద్ధులు ఇతర పౌరులను ఏమని వ్యవహరించారు?
1) జిమ్మీలు 2) త్రైవైఫ్‌లు
3) కాఫిర్‌లు 4) మ్లేచ్ఛులు

29. గజనీ మహమ్మద్ ధ్వంసం చేసిన శ్రీ చక్రస్వామి ఆలయం ఎక్కడ ఉంది?
1) కనోజ్ 2) మథుర
3) ముల్తాన్ 4) స్థానేశ్వరం

30. సోమనాథ్ దేవాలయాన్ని గజినీ మహమ్మద్ ఎప్పుడు ధ్వంసం చేసాడు?
1) క్రీ.శ. 1020 2) క్రీ.శ. 1022
3) క్రీ.శ. 1023 4) క్రీ.శ. 1025

31. కింది వాటిలో సరైంది ఏది?
1) కితాబ్–ఉల్–యామ్ని గ్రంథం – ఉత్బి
2) కితాబ్–ఉల్–హింద్ గ్రంథం – అల్‌బెరూనీ
3) బహ్మన్‌నామా గ్రంథం – అజారీ
4) పైవన్నీ సరైనవే

32. గజినీ మహమ్మద్ దండయాత్రను తొలిసారి ఎదుర్కొన్న హిందూషాహీ రాజు ఎవరు?
1) జయపాలుడు 2) ఆనందపాలుడు
3) త్రిలోచనపాలుడు 4) భీమపాలుడు

33. ఖజురహోలోని దేవాలయాలను ఏ శైలిలో నిర్మించారు?
1) ఇండో–గ్రీక్ 2) ఇండో–ఆర్యన్
3) ద్రావిడ 4) గోథిక్

34. జతపరచండి.

i) జయనకుడు	a) కుమారపాల చరిత్ర
ii) రాజశేఖరుడు	b) మాలతీ మాధవం
iii) హేమచంద్రుడు	c) ప్రబోధ చంద్రోదయం
iv) భవభూతి	d) పృథ్వీరాజ విజయం
v) ఆనందవర్ధనుడు	e) కర్పూర మంజరి

1) i-e, ii-a, iii-d, iv-c, v-b
2) i-c, ii-e, iii-b, iv-a, v-d
3) i-d, ii-e, iii-a, iv-b ,v-c
4) i-b, ii-c, iii-a, iv-e, v-d

35. కశ్మీర్‌లోని 'మార్తాండ సూర్యాలయం' నిర్మాత ఎవరు?
1) హరిసింగ్
2) లలితాదిత్య ముక్తాపీడుడు
3) బాలాదిత్య 4) జయపాలుడు

36. 'శిలా నిర్మిత సుందరనగరం' అని దేన్ని పిలిచేవారు?
1) ఉదయ్‌పూర్ 2) భగత్‌పూర్
3) జైపూర్ 4) జోధ్‌పూర్

37. 'ఖండన ఖండఖాద్యం' గ్రంథకర్త ఎవరు?
1) శ్రీహర్షుడు 2) దండి
3) పద్మగుప్తుడు 4) కల్హణుడు

38. ప్రతీహారులు తాము ఎవరి సంతతికి చెందిన వాళ్లమని చెప్పుకొన్నారు?
1) ఇంద్రుడు 2) లక్ష్మణుడు
3) వరుణుడు 4) బ్రహ్మ

39. విద్యాధరుడు అనే రాజు ఏ వంశానికి చెందినవాడు?
1) ఛందేల 2) సోలంకీ
3) పాల 4) పరమార

40. 'అరబ్బుల సింధూపై దండయాత్ర ఫలితం లేని విజయం' అని అన్నదెవరు?
1) జె.ఎన్. సర్కార్
2) రాధాకుముద్ ముఖర్జీ
3) లేన్‌పూల్ 4) వి.ఎ. స్మిత్

41. హర్షుడి పాలనాకాలం ఏది?
1) క్రీ.శ. 606 - 647
2) క్రీ.శ. 606 - 656
3) క్రీ.శ. 606 - 666
4) క్రీ.శ. 600 - 647

42. 'సూర్య శతకం' రాసిందెవరు?
1) బాణుడు 2) మతంగ దివాకరుడు
3) భర్తృహరి 4) మయూరుడు

43. కింది వాటిలో సరికాని జత?
1) యాత్రికుల్లో యువరాజు – హుయాన్‌త్సాంగ్
2) మహామోక్ష పరిషత్ – స్థానేశ్వరం
3) నలంద విశ్వవిద్యాలయం – రాజ్‌గిర్
4) కాదంబరి గ్రంథం – బాణుడు

44. హర్షుడి తొలి రాజధాని ఏది?
1) కనోజ్ 2) ఉజ్జయిని
3) శ్రీనగర్ 4) స్థానేశ్వరం

45. కింది వాటిలో హుయాన్‌త్సాంగ్ రచన ఏది?
1) నేచురల్ హిస్టరీ 2) ది ట్రావెల్స్
3) సి–యూ–కి 4) ఫో–కో–కి

46. 'సకలోత్తరాపథేశ్వరుడు' అనేది ఎవరి బిరుదు?
1) భాస్కర వర్మ 2) రెండో పులకేశి
3) రెండో ధ్రువసేనుడు 4) హర్షుడు

47. హర్షుడి వంశం ఏది?
1) పుష్యభూతి 2) పశ్చిమ చాళుక్య
3) ప్రతీహార 4) గహద్వాల

48. కింది వాటిలో హర్షుడి రచన కానిది ఏది?
1) నాగానందం 2) చండీ శతకం
3) రత్నావళి 4) ప్రియదర్శిక

49. రెండో పులకేశి, హర్షుడి రాజ్యాల సరిహద్దుగా ఉన్న నది ఏది?
1) యమున 2) గోమతి
3) నర్మద 4) కావేరి

50. 'రాజశ్రీ' ఎవరు?
1) హర్షుడి తల్లి 2) హర్షుడి కుమార్తె
3) హర్షుడి సోదరి 4) హర్షుడి పినతల్లి

51. కింది వాటిలో సరైన జత ఏది?
1) మహామోక్ష పరిషత్ – ఐదేళ్లకోసారి
2) ప్రభాకర వర్ధనుడు – హూణ హరిణ కేసరి
3) గృహవర్మ – మౌఖరి వంశం
4) పైవన్నీ సరైనవే

52. జతపరచండి.

పదజాలం	అర్థం
i) రాజస్థానీయ	a) కోశాధికారి
ii) మహాబలాధీకృత	b) అమ్మకం పన్ను
iii) భాండాగారాధీకృత	c) పన్ను వసూలు చేసే అధికారి
iv) తుల్యమేయ	d) సేనాపతి
v) ధ్రువాధికరణ	e) విదేశీ వ్యవహారాలు

1) i-e, ii-d, iii-c, iv-b, v-a
2) i-e, ii-b, iii-c, iv-d, v-a
3) i-c, ii-d, iii-a, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

53. సి-యూకి గ్రంథం ప్రకారం, క్రీ.శ. 7వ శతాబ్దంలో భారతీయులు ఏం తినరని పేర్కొన్నారు?
1) ఉల్లి, వెల్లుల్లి
2) మిరపకాయ, కందిపప్పు
3) అల్లం, మెంతులు
4) పెసరపప్పు, మినప పప్పు

54. కనోజ్‌లో జరిగిన సర్వమత మహాసభ అధ్యక్షుడెవరు?
1) భాస్కర వర్మ 2) హుయాన్‌త్సాంగ్
3) తాయిసుంగ్ 4) గౌడశశాంకుడు

55. 'దానధర్మ క్షేత్రం' అని ఏ ప్రాంతాన్ని పిలుస్తారు?
1) కనోజ్ 2) అజ్మీర్
3) ప్రయాగ 4) శ్రీనగర్

56. హర్షుడి తండ్రి ఎవరు?
1) ఆదిత్య వర్ధనుడు 2) రాజ్య వర్ధనుడు
3) ప్రభాకర వర్ధనుడు
4) భాస్కర వర్మ

57. కింది వాటిలో సరైన జత ఏది?
1) యశోమతీదేవి – హర్షుడి తల్లి
2) కామరూప – అస్సాం
3) సోమోద్భవ – నర్మదా నది
4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 3	2) 1	3) 2	4) 4	5) 1
6) 3	7) 4	8) 1	9) 2	10) 2
11) 1	12) 3	13) 2	14) 1	15) 3
16) 1	17) 2	18) 3	19) 4	20) 2
21) 4	22) 2	23) 2	24) 1	25) 3
26) 2	27) 1	28) 1	29) 4	30) 4
31) 4	32) 1	33) 2	34) 3	35) 2
36) 4	37) 1	38) 2	39) 1	40) 3
41) 1	42) 4	43) 2	44) 4	45) 3
46) 4	47) 1	48) 2	49) 3	50) 3
51) 4	52) 4	53) 1	54) 2	55) 3
56) 3	57) 4			

టెన్త్ బయాలజీ సీసీఈ విధానంలో..



పి. నీలకంఠయ్య
జెడ్‌పీహెచ్ఎస్,
కమ్మకండ్రిగ,
చిత్తూరు జిల్లా.

పిల్లల సంపూర్ణ వికాసానికి విద్య తోడ్పడాలనే లక్ష్యంతో రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)ని అమలు చేస్తున్నారు. విద్య ద్వారా పిల్లల్లో మానసిక పరిపక్వతతోపాటు స్నేహం, సహకారం, సహనశీలత, ఓర్పు వంటి వైఖరులు అలవడాలి. వారిలో తార్కిక వివేచన, సృజనాత్మక ఆలోచనలు పెంపొందాలి. సమస్యలకు కుంగిపోకుండా ఎదురునిలిచి వాటిని పరిష్కరించే నేర్పు రావాలి. వీటన్నింటి కోసం సీసీఈని ప్రవేశపెట్టారు. ఈ విధానంలో కేవలం పిల్లలకు పరీక్షలు పెట్టడం మాత్రమే కాకుండా వారి జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ నైపుణ్యాలను పెంపొందించడం ఉంటుంది. ఈ మూల్యాంకనం రెండు రకాలు. అవి..

1) **నిర్మాణాత్మక మూల్యాంకనం - ఫార్మేటివ్ అసెస్‌మెంట్**
2) **సంగ్రహణాత్మక మూల్యాంకనం - సమ్మేటివ్ అసెస్‌మెంట్**

నిర్మాణాత్మక మూల్యాంకనం: ఇది అంతర్గత మూల్యాంకనం. విద్యార్థి సామర్థ్యాలను, సాధన స్థితిగతులను అంచనా వేసేందుకు, అభ్యసనాన్ని మెరుగుపర్చడానికి ఈ మూల్యాంకనం సహాయపడుతుంది. తరగతి గదిలో జరిగే చర్చలు, పిల్లల ప్రతిస్పందనలు, పిల్లలు రాసిన నోటు పుస్తకాలు, తరగతి పని, ఇంటిపని, ప్రాజెక్ట్ పనులు, ప్రయోగశాల కృత్యాలు వంటి అంశాల ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహిస్తారు.

ఇందులో నాలుగు రకాల సాధనాలను ఉపయోగిస్తారు.

జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలు

1) రాత అంశాలు – 10 మార్కులు
2) ప్రాజెక్ట్ పనులు–10 మార్కులు
3) ప్రయోగశాల పనులు – 10 మార్కులు
4) లఘు పరీక్ష–20 మార్కులు. పై సాధనాల ద్వారా సాధించిన గ్రేడ్‌లను నమోదు చేయాలి.

జీవశాస్త్రంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ నిర్వహణ:

విద్యార్థులు రెండు లాంగ్‌సైజ్ నోట్‌బుక్‌లు తీసుకోవాలి. ఒకదానిలో తరగతి గది రాత పని, మరొకదానిలో ప్రాజెక్ట్ పని, ప్రయోగశాల నివేదిక, లఘు పరీక్షను రాయాలి.

1. రాత పనులు - నోటు పుస్తకాలు: పిల్లలు తాము అవగాహన చేసుకున్న అంశాన్ని సొంత మాటలతో వ్యక్తీకరించడానికి, భావాన్ని లిఖిత రూపంలో తెలియజేయడానికి లేఖనా నైపుణ్యం అవసరమని మనకు తెలుసు. ఇందు కోసం నోటు పుస్తకాలు ఉపయోగపడతాయి. వీటిలో పిల్లలు ప్రశ్నలకు జవాబులను సొంత మాటల్లో రాయాలి. దీనివల్ల పిల్లల్లో భావనల పట్ల స్పష్టత వస్తుంది. రాత పనికి పది మార్కులుంటాయి. ఉపాధ్యాయుడు కింది అంశాల ఆధారంగా మార్కులు కేటాయించాలి.

1) సొంతంగా రాసినదై ఉండటం
2) బొమ్మలు గీసి ఉండటం
3) భాషాదోషాలు లేకుండా ఉండటం.

2. ప్రాజెక్ట్ పని: పాఠ్య పుస్తకంలో ప్రతి పాఠం మధ్యలో కొన్ని ప్రాజెక్టులు ఇచ్చారు. వీటితోపాటు స్థానిక వనరులు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుడు సొంతంగా కొన్ని ప్రాజెక్ట్‌లు తీసుకోవచ్చు.

ప్రతి ఫార్మేటివ్ కాలంలో ఒక ప్రాజెక్ట్‌ను తప్పనిసరిగా చేయాలి. పాఠంలో ఇచ్చిన కృత్యాలు ప్రాజెక్ట్‌లు కావు. ప్రాజెక్ట్‌లో ఒక



సమస్య పరిష్కారం కోసం వేర్వేరు సాధనలు ఉపయోగించి సమాచారాన్ని సేకరించి విశ్లేషించాలి. చివరకు నిర్ధారణకు రావాలి. ప్రాజెక్ట్‌ని వ్యక్తిగత, జట్టు ప్రాజెక్ట్ పనిగా ఇవ్వాలి. ఇంటర్వ్యూ చేయడం, సమాచార సేకరణ, పరిశోధన గ్రంథాలు, రిఫరెన్స్ పుస్తకాలు చదవడం ద్వారా ప్రయోగాలు చేయడం, వస్తువును, నమూనాను తయారు చేయడం కూడా ప్రాజెక్ట్‌లో భాగమే. ప్రాజెక్ట్‌లో రెండు ప్రధానాంశాలుంటాయి. అవి...

1) ప్రాజెక్ట్‌కు సిద్ధం కావడం, నిర్వహించడం.
2) ప్రాజెక్ట్ నివేదిక రాయడం.

కింది అంశాలు ప్రాజెక్ట్ నివేదికలో ఉండాలి.

1) ప్రాజెక్ట్ పేరు/సమస్య/ప్రశ్న
2) లక్ష్యాలు
3) ఎంచుకునే సాధనాలు/అధ్యయనం చేయడం
4) అధ్యయన పద్ధతి
5) విషయ విశ్లేషణ – పట్టికలు
6) ముగింపు 7) ఉపయోగించిన వనరులు
8) కృతజ్ఞతలు

విద్యార్థులు ఉపయోగించిన సాధనాలు, ప్రాజెక్ట్ నిర్వహణ తీరును బట్టి మార్కులు కేటాయిస్తారు. జట్టుగా ప్రాజెక్ట్‌ను నిర్వహించినా వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థి మొత్తం నివేదికను ఫార్మేటివ్ నోట్స్‌లో రాయాలి.

3. విద్యార్థి ప్రతిస్పందనలు, ప్రయోగశాల పనులు/రికార్డ్ నిర్వహణ

విజ్ఞాన శాస్త్రాన్ని నేర్చుకోవడంలో ప్రయోగాల నిర్వహణ ముఖ్యమైంది. విద్యార్థులు ప్రయోగశాలలో చేసిన ప్రయోగ విధానాన్ని, సాధించిన ప్రక్రియ నైపుణ్యాలను మదింపు చేయాలి. ఇందుకోసం పరికరాల అమరికలో వారు ప్రదర్శించే నైపుణ్యం, పరిశీలనల నమోదు, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అదే విధంగా ప్రయోగాలు చేసిన తర్వాత నివేదిక రూపంలో దాన్ని ఫార్మాట్ మూల్యాంకనం నోట్స్‌లో రాయాలి.

ల్యాబ్ రికార్డ్‌లో ఉండాల్సిన అంశాలు..

ఉద్దేశం, కావాల్సిన పరికరాలు, ప్రయోగ విధానం, పరిశీలనలు/ నమోదు, ఫలితాల విశ్లేషణ, సాధారణీకరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రయోగం చేసిన పద్ధతికి 4 మార్కులు, ప్రయోగశాల రికార్డుకు 6 మార్కులు మొత్తంగా పది మార్కులు కేటాయిస్తారు.

4. లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్): పాఠాన్ని బోధించిన తర్వాత విషయావగాహన ఏ మేరకు జరిగిందో ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవడం కోసం పరీక్షను నిర్వహించాలి. నిర్దేశించిన సమయంలో కాకుండా పరీక్ష అనే భావన కలగకుండా ఏ సమయంలోనైనా పరీక్షను నిర్వహిస్తారు. ఇది సాధారణ యూనిట్ పరీక్ష వంటిది కాదు. ఇది 20 మార్కులకు జరుగుతుంది. దీన్ని కూడా ఫార్మేటివ్ నోట్స్‌లోనే రాయాలి. విద్యా సంవత్సరంలో నాలుగుసార్లు ఈ పరీక్ష నిర్వహిస్తారు.

సంగ్రహణాత్మక మూల్యాంకనం: బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా విద్యార్థి నేర్చుకున్న అంశాలను మొత్తంగా మూల్యాంకనం చేయడమే సంగ్రహణాత్మక మూల్యాంకనం. ఏడాదిలో మూడుసార్లు అంటే SA-I, SA-II, SA-III (పబ్లిక్) పరీక్షలు నిర్వహిస్తారు. నిర్దేశిత విద్యా ప్రమాణాల ఆధారంగా వెయిటేజ్‌ను నిర్ణయించి పరీక్షను నిర్వహిస్తారు.

పై ప్రమాణాల ఆధారంగా దీర్ఘ సమాధాన ప్రశ్నలు, లఘు రూప, స్వల్ప సమాధాన, బహుళైచ్ఛిక రూపంలో ప్రశ్నలు వస్తాయి. భాషేతర అంశాలైన గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘిక శాస్త్రంలో ప్రశ్నల స్వరూపం, సంఖ్య ఇదే విధంగా ఉంటుంది. కేవలం 4 మార్కుల ప్రశ్నలకు అంతర్గత చాయిస్ ఉంటుంది. మిగిలిన ప్రశ్నలన్నింటినీ విద్యార్థి తప్పకుండా రాయాలి. చాయిస్ ఉండదు.

సైన్స్‌లో విద్యా ప్రమాణాల వారీగా వెయిటేజ్

విద్యా ప్రమాణాలు	వెయిటేజీ	మార్కులు
విషయావగాహన	40%	16
ప్రశ్నించడం, పరికల్పనలు చేయడం	10%	4
ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు	15%	6
సమాచార నైపుణ్యాలు	15%	6
బొమ్మలు గీయడం ద్వారా భావ ప్రసారం	10%	4
నిజ జీవిత వినియోగం, ప్రశంస	10%	4

ప్రశ్న రకం	ప్ర. సం.	మార్కులు	మొత్తం
స్వల్ప సమాధానం	4	4	4×4=16
లఘురూపం	5	2	5×2=10
దీర్ఘ సమాధాన ప్రశ్నలు	4	1	4×1=4
బహుళైచ్ఛికం	20	1/2	20×1/2=10

The validity of the GST registration?



K.V. Gnana Kumar
Director,
DBS, Hyderabad



Model Questions


1. The Banking Ombudsman may reject a complaint at any stage if it appears to him that a complaint made to him ____:
   a) If the Compensation sought from the Banking Ombudsman is beyond Rs. 20 lakh
   b) If it requires consideration of elaborate documentary and oral evidence
   c) If the proceedings before the Banking Ombudsman are not appropriate for adjudication of such complaint
   d) If the complaint is without any sufficient cause
   e) All the above
2. Who among the following set up the Credit Guarantee Fund Trust for Micro and Small Enterprises (CGTMSE)?
   a) GOI
   b) Ministry of MSME
   c) SIDBI d) a & c
   e) Reserve Bank of India
3. Who among the following can issue Commercial Paper(CP)?
   a) Corporates
   b) Primary Dealers
   c) All India Financial Institutions
   d) a, b, & c e) a & b only
4. As per the latest audited balance sheet, If the tangible net worth of the company is not less than ______ crore, then the corporate would be eligible to issue CP.
   a) 4 b) 3 c) 2
   d) 5 e) None of these
5. Compensation amount not exceeding Rs. _____ lakh to the complainant for mental agony and harassment may be awarded by Banking Ombudsman.
   a) 1 b) 2 c) 3
   d) 5 e) None of these
6. As per the existing Priority Sector guidelines Which of the following categories are there?
   a) Export Credit b) Agriculture
   c) Social Infrastructure
   d) Renewable Energy
   e) All of these
7. Currency note of Rs. 500 will have ' five bleed lines on left and right in raised print'. Similarly how many bleed lines are there on the left and right in Rs. 2000 currency note?
   a) 3 b) 4 c) 6 d) 7 e) 8
8. Which of the following forms are used for Acknowledgement of registration for GST?
   a) Form GSTR -1
   b) Form GSTR -2
   c) Form GST REG-02
   d) Form GST REG
   e) None of these
9. If the fourth letter in PAN CARD is 'P' then it denotes _____:
   a) Company b) Firm
   c) Person d) Trust
   e) HUF
10. The validity of the GST registration certificate is:
    a) One year b) Two years
    c) Five years
    d) Valid till it is canceled
    e) None of these
11. The Headquarters of TransUnion CIBIL is located in _________ :
    a) Chennai b) Kolkatta
    c) Mumbai d) Bengaluru
    e) None of these
12. Net Owned Funds of a Non-Banking Finance Company should be Rs.______ to get the NBFC license from RBI.
    a) 100 Lakh b) 150 Lakh
    c) 200 Lakh d) 250 Lakh
    e) None of these
13. In NRE account "R" stands for:
    a) Residential b) Recoverable
    c) Resident d) Residual
    e) None of these
14. Bharat Nirman is a four-year business plan embarked by the Government of India for providing rural infrastructure in the areas of:
    a) Irrigation & water supply
    b) Electrification c) Housing
    d) Telecommunication & connectivity
    e) All the above
15. NIXI stands for:
    a) National & International Exchange of India
    b) National Internet Exchange of India
    c) National Inter Exchange Interest
    d) None of the above
    e) National Industrial Exchange of India

KEY

1) e	2) d	3) d	4) a
5) a	6) e	7) d	8) c
9) c	10) d	11) c	12) c
13) c	14) e	15) b	16) c

గుర్తించండి

raft
hike
kiwi
branch
sweater
teacher
lolipop
log



b	p	b	i	h	t	h	b	b
r	g	r	k	w	n	i	w	r
e	l	a	z	m	f	k	j	a
h	o	n	a	v	o	e	o	f
c	g	c	p	b	n	u	p	t
a	v	h	j	g	q	z	t	u
e	c	n	z	t	i	w	i	k
t	r	e	t	a	e	w	s	t
i	l	o	l	i	p	o	p	j

పైన ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి

దారి కనుక్కోండి

తన స్నేహితులతో కలిసి వచ్చిన వంకాయ తప్పిపోయింది. తన స్నేహితుల వెళ్లడానికి దారి చూపిస్తారా?



నాన్నా చెప్పవా?

పెంగ్విన్లు సముద్రంలో ఎలా ఉండగలుగుతాయి?




మన భూగోళం మీద, మంచుతో నిండిన అంటార్కిటికా ప్రాంతంలో నివసించే పెంగ్విన్లు అద్భుతమైన డైవర్లనీ, గజఈతగాళ్ళనీ వర్ణించ వచ్చు. ఇవి సముద్రంలో 500 మీటర్ల లోతు దాకా వెళ్లడమే కాకుండా, పైకి రాకుండా సుమారు 15 నిమిషాల దాకా నీటిలోపల ఉండ గల్గుతాయి. ఇందుకు ఒక ముఖ్య కారణమే ఉంది లెండి.

పెంగ్విన్ల శరీర ఉష్ణోగ్రత సాధారణంగా 38 డిగ్రీల సెల్సియస్ వుంటుంది. అయితే ఇవి సముద్రం లోపలికి దిగాక వాటి ఉష్ణోగ్రత 11 డిగ్రీలకు పడిపోతుంది. దాంతో వాటి శరీరం లోపలి కణజాలాలన్నీ తమ తమ జీవన చర్యల వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి అవసరమైన ఆమ్లజని వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి ఆవసరమైన ఆక్సిజన్ కూడా గణనీయంగా తగ్గిపోతుందన్నమాట. ఈ కారణంగా అవి అంతకు ముందు పీల్చుకున్న గాలిలోని ఆక్సిజన్ సాయంతో సుమారు 15 నిమిషాల దాకా నీటి లోపల ఉండగల్గుతాయి.


ఒకవేళ సముద్రం లోపలికి వెళ్ళాక వాటి శరీర ఉష్ణోగ్రత పడిపోయి తద్వారా జీవన చర్యలు మందగించకుండా ఉన్నట్లయితే పెంగ్విన్లు అంతసేపు నీటిలో ఉండటం అసాధ్యమవు తుంది. ఎందుకంటే వాటి శరీరానికి.... పావుగంట సేపు బతికేందుకు కావలసిన ఆక్సిజన్‌ని తమలో నిలుపుకోగలిగే సామర్థ్యం వుండదు.

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 8 తేడాలను గుర్తించండి



నీడను గుర్తించండి

పక్కన ఇచ్చిన 5 నీడల్లో ఈ జంతువు అసలు నీడ ఏదో గుర్తించండి



కనుక్కోండి



తెలుసా!


డచ్ దేశస్థులు ఏడాదికి సగటున వెయ్యి కిలోమీటర్లు ప్రయాణిస్తారు




ప్రపంచ దేశాలతో పోల్చినపుడు చైనాలో ఉరిశిక్షలు 4 రెట్లు అధికం



కింద ఇచ్చిన బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రంగులు వేయండి



సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ ప్రారంభం నేడు

● నేరుగా శిక్షణకు హాజరుకావచ్చు

సాక్షి, మైత్రి మహిళ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ ప్రారంభమైనట్టు నిర్వాహకులు తెలిపారు. టైలరింగ్ విభాగంలో బాడీ మెజర్‌మెంట్స్ అండ్ కటింగ్, డ్రాఫ్టింగ్ థియరీ, మెథడ్ ఆఫ్ కటింగ్ అండ్ స్టిచ్చింగ్, నెక్ ఫినిషింగ్, ప్యాచ్ వర్క్, కాలర్‌నెక్ బ్లౌజ్, ప్రిన్సెస్ కట్ బ్లౌజ్, కొటారి, బోట్‌నెక్ బ్లౌజ్ విభాగాల్లో శిక్షణ ఉంటుందన్నారు. వీటికి 900 రూపాయలు ఫీజుగా నిర్ధారించారు. ఆసక్తి గల అభ్యర్థులు సత్యకృష్ణ ఫ్యాషన్ డిజైనింగ్ హౌస్, ఎంఆర్‌ఓ ఆఫీస్ దరి, చిన్నవీధి, విజయనగరంలో గురువారం నేరుగా సంప్రదించవచ్చన్నారు. శిక్షణ 06-09-17 వరకు కొనసాగుతుం దన్నారు. మరిన్ని వివరాలకు 96662 83534 నంబర్‌కు సంప్రదించాలన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి కేజీబీవీ బాలికలు



రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన బొబ్బిలి కేజీబీవీ బాలికలు

తెర్లాం రూరల్(బొబ్బిలి): గుంటూరులో వచ్చే నెల జరగనున్న అండర్-17 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ముగ్గురు క్రీడాకారిణిలు ఎంపికయ్యారు. ఈనెల 28న విజయనగరంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 తైక్వాండో పోటీల్లో బి.అఖిల, ఎం.ఈశ్వరి, ఆర్.కుసుమలు అత్యుత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని బొబ్బిలి తైక్వాండో కోచ్ బంకురు ప్రసాద్, కేజీబీవీ ఎస్.ఛాయాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు టి.గౌరీమణిలు బుధవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

● నాలుగు వేదికల్లో సర్ విజ్జి ఆహ్వానపు క్రికెట్ టోర్నీ మ్యాచ్‌లు
● ఒక్క పరుగు తేడాతో సెంచరీ చేజార్చుకున్న అశ్విన్‌హెబ్బర్



విజయనగరం మున్సిపాలిటీ: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నిలిచిపోయిన సర్ విజ్జి ఆహ్వానపు క్రికెట్ టోర్నీ ఎట్టకేలకు ప్రారంభమైంది. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెస్టు మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు నిర్వహించాల్సిన మ్యాచ్‌లకు మూడో రోజు బుధవారం వర్షం విరామం ఇచ్చింది. విశాఖ ఏసీఏ-వీడీసీఏ మైదానం ఆవరణలో మంగళవారం నాలుగు ఓవర్ల మ్యాచ్ జరగగా, విజయనగరం జిల్లా వేదికగా మూడు మైదానాల్లో మ్యాచ్‌లను ప్రారంభించారు. డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఆంధ్రా-ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడిన ఆంధ్రా జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించగా... మూడో రోజు ఆటముగిసే సమయానికి 49 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేశారు. జట్టులో కె.ఎస్.భరత్ 49 పరుగులతో నాటౌట్‌గా రాణిస్తుండగా.. డి.బి.ప్రశాంత్ 31 పరుగులు, ఎ.జి.ప్రదీప్ 22 పరుగులు చేశారు.

ఒక్క పరుగు తేడాతో సెంచరీ చేజార్చుకున్న అశ్విన్‌హెబ్బర్..

ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆంధ్రా 11-ఓఎన్‌జీసీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆంధ్రా-11 జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 229 పరుగులు చేయగా.... జయవర్ధన్ 85 పరుగులు నాటౌట్‌గా నిలిచాడు. మరో క్రీడాకారులు ఆశ్విన్‌హెబ్బర్ 1 పరుగు తేడాతో 99 పరుగులు చేసి సెంచరీ చేజార్చుకున్నాడు. బౌలింగ్‌లో ఓఎన్‌జీసీ క్రీడాకారుడు హిమాంక్‌సింగ్ 1 వికెట్ దక్కించుకున్నాడు.

విజ్జిస్టేడియంలో...

విజయనగరం పట్టణ శివారులోని విజ్జిస్టేడియం ఆవరణలో బరోడా-నైరోబీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన బరోడా జట్టు ఆట ముగిసే సమయానికి 56 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ మైదానంలో నాలుగు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 16 పరుగులు ఓవర్‌నైట్ స్కోరు వద్ద మూడో రోజు తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ జట్టు మొత్తం 102 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. పటేల్ 83 పరుగులు, ధర్మేష్ పటేల్ 47 పరుగులు, ఆర్‌టైలర్ 62 పరుగులతో రాణించారు.

విజయనగర చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించేలా..

● అక్టోబర్ 1, 2 తేదీల్లో ఉత్సవాల నిర్వహణ
● అధికారుల సమీక్ష సమావేశంలో జేసీ శ్రీకేష్ బి.లఠ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీకేష్ బి.లఠ్కర్

విజయనగరం గంటస్తంభం:

విజయనగరం చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించేలా అక్టోబర్ 1, 2 తేదీల్లో విజయనగరం ఉత్సవాలు నిర్వహించాలని జేసీ శ్రీకేష్ బి.లఠ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై బుధవారం సమీక్షించారు. ఉత్సవ కమిటీలను నియమించారు. ఉత్సవాల పర్యవేక్షణకు జేసీ, జేసీ-2, డీఆర్వో, ఇతర అధికారులతో ఫైనాన్స్, హైపవర్ కమిటీని కలెక్టరు నియమించినట్టు జేసీ వెల్లడించారు. గ్రీన్ విజయనగరం అంశానికి ప్రాధాన్యమిస్తామన్నారు. విజయనగరం ఉత్సవాలతో పాటు పైడితల్లి అమ్మవారి పండగ ఒకేసారి వచ్చినందున విద్యుత్ దీపాలతో పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని, చారిత్రక ప్రదేశాలకు అధిక గుర్తింపునివ్వాలని మన్సాస్, పర్యాటక శాఖ అధికారులకు సూచించారు. ఉత్సవాల అంశాన్ని సోషల్ మీడియా, యూట్యూబ్, వెబ్‌సైట్, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో జేసీ-2 నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ విస్తృత ప్రచారం చేయాలన్నారు. అయోధ్యా మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు, డ్వాక్రా బజార్, ఫుడ్ ఫెస్టివల్, డాగ్ షో, ప్రభుత్వ కార్యక్రమాలపై వివిధ స్టాల్స్ నిర్వహణకు బొబ్బిలి ఎస్‌డీసీ అనిత, ఐసీడీఎస్ పీడీ రాబర్ట్స్, ఇతర అధికారులను, ఉత్సవాల జీవితకాల సభ్యులు శ్రీరామభద్రజా, ఎస్‌ఎస్‌ఎస్‌ఎస్ రాజు, వి.ఎస్.ప్రసాద్, ఇతరను నియమించామన్నారు. ఆనంద గజపతి ఆడిటోరియంలో జరిగే ప్రారంభ, ముగింపు ఉత్సవాల పర్యవేక్షణకు విజయనరగం ఆర్డీవో శ్రీనివాస మూర్తి, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరావు, ఇతర అధికారులను నియమించామన్నారు. ఫ్లవర్ షోను ఉద్యానశాఖ డీడీ లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు, సైన్స్ ఫెయిర్‌ను డీఈవో అరుణకుమారి, ఎస్ఎస్ఏ పీవో, ఇతర అధికారులు చూడాలన్నారు. గురజాడ కళాభారతిలో నిర్వహించే కార్యక్రమాల బాధ్యతను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజుకు అప్పగించారు. సంస్కృత కళాశాలలో జరిగే కార్యక్రమాలను కళాశాల ప్రిన్స్‌పాల్ చూడాలన్నారు. ఆహ్వాన పత్రికలు, పోస్టర్లు, సావనీర్ బాధ్యత జేసీ-2, డీఆర్వో, ఇతర సపోర్టింగ్ అధికారులు చూడాలన్నారు. భోజన ఏర్పాటు బాధ్యత పార్వతీపురం ఆర్డీవోకు అప్పగించారు. మీడియాలో విస్తృత ప్రచారం కోసం పౌరసంబంధాలశాఖ ఏడీని నియమించారు. విద్యుత్ సమస్య, ట్రాఫిక్ సమస్యలు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కమిటీలో అధికారులతో పాటు ఉత్సవ జీవితకాల సభ్యులను నియమించామని, వారితో సమన్వయం చేసుకుని ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ విజయనగర ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలన్న ఉద్దేశంతో విస్తర్ణ పనులు వేగవంతం చేశామన్నారు. సమావేశంలో జేసీ-2 నాగేశ్వరరావు, ఏఎస్పీ రమణ, డీఆర్వో రాజ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐసీటీ ప్రాజెక్టులో నవోదయ విద్యార్థి ప్రతిభ

● జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



గుంటూరులో జరిగిన రీజనల్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించి జ్ఞాపికను అందుకుంటున్న నవోదయ విద్యార్థి లోకేష్‌నాయుడు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న ఎస్.పి.లోకేష్‌నాయుడు ఐసీటీ ప్రాజెక్టు ప్రదర్శనలో ప్రతిభ చూపాడు. ఇటీవల పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లో జరిగిన ఐసీటీ ప్రాజెక్టుల ప్రదర్శనల్లో 'ఎ.ఆర్.ఇన్ ఎడ్యుకేషన్' ప్రాజెక్టుతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నాడు. త్వరలో ఉత్తరప్రదేశ్‌లో జరగపోయే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మొబైల్ టెక్నాలజీ సహాయంతో ఇమేజ్ వగైరాలను వెర్చువల్ రియాలిటీతో చూడగలమే తప్ప యూజర్ ఇంటర్‌ఫియరెన్సుకు అవకాశం లేదు. దానిని మరిపిస్తూ ఔరస్మా అనబడే 'యాప్ కమ్ స్టూడియో' సహాయంతో న్యూమొబైల్ టెక్నాలజీని ఐసీటీ ప్రాజెక్టులో లోకేష్ ప్రదర్శించాడు. ఈ ఇమేజ్ టెక్నాలజీతో 4డీ లేదా అంతకన్నా ఉన్నతమైన దృష్టితో అత్యంత స్పష్టంగా చూడవచ్చని ప్రయోగాత్మకంగా నిరూపించాడు. విద్యార్థిని, ఆయనకు సాయపడిన బయాలజీ పీజీటీ రాఘవేంద్రరావు, కంప్యూటర్ ఉపాధ్యాయుడు అప్పలరాజులను ప్రిన్సిపాల్ దామా అంజయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎం.సత్యవతి తదితరులు అభినందించారు. జాతీయ స్థాయి ప్రదర్శనల్లో రాణించాలని ఆకాంక్షించారు.

విజయనగరం | గురువారం | ఆగస్టు | 31 | 2017 సాక్షి

అపర సరస్వతి.. ఆదిభట్ల



ఆదిభట్ల నారాయణదాసు

- నేడు 153వ జయంతోత్సవం
- సంగీత కళాశాలలో కాంస్య విగ్రహం ఏర్పాటు

నాలుగేళ్ల వయసులోనే భాగవత పద్యాలను ఆలపించాడు. అయిదేళ్లకే కావ్య సంబంధిత పాఠాలను వల్లె వేశాడు. పదేళ్ల ప్రాయంలోనే తాళ పత్ర గ్రంథాలు రాశాడు. పద్నాలుగేళ్ల వయసులో ఆంగ్లంలో అంతు లేని జ్ఞానాన్ని సముపార్జించాడు. పంతొమ్మిదో ఏట హరికథాగానాన్ని సుమధుర గళంతో ఆవిష్కరించాడు. విజయనగరం జిల్లాకు విశ్వఖ్యాతినార్జించి పెట్టాడు. ఆయనే హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు.

– విజయనగరం టౌన్

ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగస్టు 31న అప్పటి బొబ్బిలి తాలూకా అజ్జాడ గ్రామంలో జన్మించారు. తల్లి నరసమ్మ, తండ్రి చయనులు. ఆ దంపతులకు దాసు ఎనిమిదో సంతానం. పదేళ్లకే ఘంటం పట్టుకుని తాళపత్ర గ్రంథాలను రాయగలిగే నేర్పును సంపాదించారు. ఆయన పూర్తిపేరు సూర్యనారాయణదాసు. ముద్దుపేరు సూరన్న. నారాయణదాసుకు తొలి గురువు బొబ్బిలి సంస్థానంలో వీణ విద్వాంసుడైన వాసా సాంబయ్య. ఆంగ్లంపై పట్టు సంపాదించేందుకు విజయనగరం వచ్చిన దాసుకు ప్రముఖులు మహబత్‌ఖాన్, పప్పు వెంకన్న, వీణా వెంకటరమణదాసు, కలిగొట్ల కామరాజు తదితరుల దీవెనలు మెండుగా లభించాయి.



మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల

పంతొమ్మిదో ఏటే హరికథాగానం

ఓసారి మద్రాసు నుంచి కుప్పుస్వామి నాయుడు అనే ప్రముఖుడు విజయనగరం వచ్చి కానుకుర్తి హనుమంతరావు ఇంటి వద్ద హరికథ చెప్పారు. అది చూసిన నారాయణదాసు ఎంతో స్ఫూర్తి పొందారు. 19 ఏళ్ల ప్రాయంలో నాయుడు వద్ద హరికథాగానంలో మెలకువలు నేర్చుకున్నారు. ధ్రువచరిత్ర యక్షగాన ప్రబంధాన్ని స్వయంగా రాసి అన్న సీతారామయ్య ఆశీర్వాదంతో వేణుగోపాలస్వామి మఠంలో తొలిసారిగా హరికథా గానం చేశారు. 1883లో వడ్లమాని సుబ్బారావు సోదరుని కుమార్తెను వివాహమాడారు. విజయనగరం మహారాజా సంగీత కళాశాలకు కొంత కాలం ప్రధాన అధ్యక్షునిగా పనిచేశారు. ఆయన సంస్కృతం, ఆంగ్లం, తెలుగు , హిందీ, పారశీకం, అరబ్బీ, ఉర్దూ, తదితర భాషల్లో దిట్ట. ఉమర్ ఖయ్యాం రాసిన రుబాయిలను కూడా మధురంగా ఆలపించేవారు. దాసు పెనుమత్స జగన్నాథరాజు ప్రోత్సాహంతో పిఠాపురంలో రాజా ముందు హరికథ చెప్పి అనేక బహుమతులు పొందారు.

కాంస్య విగ్రహావిష్కరణ నేడు

ఆదిభట్ల 153వ జయంతి వేడుకలను మహారాజా సంగీత, నృత్య కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆదిభట్ల నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 8 గంటలకు నారాయణదాసు చిత్రపటంతో ఊరేగింపు, విగ్రహ రూపశిల్పి సి.రవిశంకర్ పట్నాయక్‌కు సత్కారం, అనంతరం హరికథా చూడామణి బిరుదు పొందిన జయంతి సావిత్రి భాగవతార్, కోట సచ్చిదానందశాస్త్రి, కాళ్ల నిర్మల, సినీ నటి పడాల కల్యాణి, ధూళిపాల శివరామకృష్ణ భాగవతార్, సింహాచల భాగవతార్‌లతో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 వరకూ హరికథాగానం చేస్తారు.

అష్టావధానంలోనూ అద్భుత ప్రతిభాశాలి

1886లో విశాఖలో ప్రముఖ న్యాయవాది వేపా రామేశం ఆహ్వానం మేరకు అష్టావధానం చేశారు. దాసుకు అంబరీషోపాఖ్యానం, జానకీ శపథం, యధార్థ రామాయణం, గజేంద్రమోక్షం, ప్రహ్లాద చరిత్ర, సావిత్రి చరిత్ర, భీష్మ చరిత్ర, మార్కండేయ చరిత్ర, శ్రీకృష్ణ జననం, సీతాకల్యాణం తదితర హరికథలు గొప్ప పేరు తెచ్చిపెట్టాయి. ఆయన రుక్మిణీ కల్యాణం, కాశీ శతకం, సారంగధర, తారకం, ధర్మసంస్థాపనం, మత్యుంజయ శతకం తదితర 46 రచనలు చేశారు. ఆయనకు 1933లో జయపూర్ మహారాజా విక్రమదేవ వర్మ 'సంగీత సాహిత్య సార్వభౌమ' అనే బిరుదు ఇచ్చారు. ఆదిభట్ల 1945 జనవరి 2వ తేదీన కన్నుమూశారు.

ఆనందకరం



కళాశాల తొలి ప్రిన్సిపల్‌గా పనిచేసిన హరికతా పితామహుడు ఆదిభట్ల విగ్రహ ప్రతిష్టాపన ఆనందకరం. ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. కళాశాల నుంచి ఎందరో మహానుభావులు దేశ విదేశాల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. *– బురిడి అనూరాధా పరశురామ్, ప్రిన్సిపల్, మహారాజా సంగీత, నృత్య కళాశాల*

చాలా ఆనందంగా ఉంది



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అభినందనీయం. ఏటా ప్రతిచోటా ఆదిభట్ల జయంతి ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనందదాయకం. ఆదిభట్ల నిలువెత్తు కాంస్య విగ్రహ ప్రతిష్ట ఒక ప్రత్యేక అంశం. ఆదిభట్ల అభిమానులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలి. *– పడాల కల్యాణి, సినీనటి, వ్యవస్థాపకురాలు, శ్రీ ఆదిభట్ల శ్రీకళాపీఠం*

505 కీర్తనలతో పుస్తకం ప్రచురణ ● ఉచిత పంపిణీకి ఏర్పాట్లు

అమ్మానాన్నల జ్ఞాపకం అన్నమయ్య సంకీర్తనం

అన్నమయ్య కీర్తనలు అమృత గుళికలు. ఒకటా రెండా.. 32 వేల కీర్తనలు. ఒకదానికొకటి తీసిపోనివి. అన్నీ అద్భుతాలే. వాటిలో ఆణిముత్యాల్లాంటి కీర్తనలను ఎంపిక చేయడం కత్తిమీద సామే. కానీ పార్వతీపురానికి చెందిన వాసవి, గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆ పని చేశారు. అన్నమాచార్యుడు రచించిన 32 వేల కీర్తనల్లో 505 కీర్తనలను ఎంపిక చేసి పుస్తకంగా ప్రచురించారు. వాటిని ఉచిత పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు.



అన్నమాచార్య కీర్తనలను ఆవిష్కరిస్తున్న కాళిదాసు శర్మ తదితరులు

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం

వాసవి, గాయత్రి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, తల్లిదండ్రులైన పేర్ల వెంకట రమణ మూర్తి, వసుంధరా దేవి జ్ఞాపకార్థం ప్రచురించిన అన్నమాచార్యుని సంకీర్తనల పుస్తకాలను బుధవారం వేంకటేశ్వరా కళామందిర్‌లో శ్రీవిద్య సర్వమంగళా దేవి పీఠం వ్యవస్థాపకుడు మురపాక కాళిదాసు శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్యుడు సాక్షాత్తు ఆ పరబ్రహ్మ స్వరూపాన్నే తన కీర్తనలతో దాసోహం చేసుకున్న మహోన్నతుడని కొనియాడారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కీర్తనలను పట్టణానికి చెందిన నేరెళ్ల లలిత, సుబ్బలక్ష్మి ఆలపించారు. అనంతరం సభికులకు ఉచితంగా అన్నమాచార్య సంకీర్తనల పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎంపీపీ హరిప్రియా థాట్రాజ్, ప్రముఖ వేదగణిత పండితుడు నేరెళ్ల నారాయణమూర్తి పాల్గొన్నారు. – పార్వతీపురం టౌన్



అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని పుస్తకం



రామతీర్థంలో పచ్చని వరి పైరు

భూమికి పచ్చని రంగేసినట్టు..

కొండలను కమ్మేసిన మేఘాలు. పచ్చని పంట పొలాలు. కనువిందు చేసే చెట్టూ చేమా.. చూసే కళ్లకు నేత్రానందం. మనసుకు పరవశం. ప్రకృతి గీసిన అద్భుత చిత్రం. ఈ దృశ్యమాలిక నెల్లిమర్ల–రణస్థలం రహదారిలో దర్శనమిస్తుంది. పచ్చని చెట్లతో పెద్ద పెద్ద కొండలు.. వాటిని కమ్మేసిన మేఘం ప్రకృతి ప్రేమికులను రారమ్మంటుంది. కొత్తపేట, రామతీర్థం, సతివాడ గ్రామాల్లోని కొండలు పచ్చదనంతో పరవశింపజేస్తున్నాయి. ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రకృతి అందాల్ని చూసి మురిసిపోతున్నారు. సెల్ కెమెరాల్లో బంధిస్తున్నారు. – నెల్లిమర్ల రూరల్



కొత్తపేట వద్ద కొండలపై మేఘమాల



కొత్తపేట రోడ్డులో పూర్తికాని భవనాల తొలగింపు

పండగొస్తున్నా పట్టదా..

పైడితల్లి సిరిమానోత్సవానికి విజయనగరం సిద్ధమవుతోంది. జాతర తేదీలు ఖరారవడంతో అమ్మవారి దర్శనానికి అఖండ భక్తకోటి ఉవ్విళ్లూరుతోంది. లక్షల సంఖ్యలో హాజరయ్యే రద్దీని తట్టుకునేందుకు తలపెట్టిన రహదారుల విస్తరణ ప్రక్రియ మాత్రం చతికిలపడింది. ఇష్టమొచ్చినట్టు తవ్విపారేసిన గోతులు.. నిర్మాణ సామగ్రితో పాదచారులకు నరకయాతన మిగులుతోంది.

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



స్టేట్‌బ్యాంక్ పక్కన తవ్వి వదిలేసిన రోడ్డు



కోట ప్రాంతంలో గోతిని దాటుతున్న వృద్ధుడు



బాలాజీ కూడలి రోడ్డులో గోతిని దాటుతున్న పాదచారి



సంగీత కళాశాల వద్ద విద్యార్థుల అవస్థలు



బాలాజీ కూడలి రోడ్డులో పూర్తి కాని కాలువ పనులు



సంగీత కళాశాల మార్గంలో తవ్విన రోడ్డు



రోడ్డు విస్తరణకు తీసుకొచ్చిన రాళ్ల కుప్పలు